

అదరగొట్టిన అశుతోష్

ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం



అశుతోష్ శర్మ 66 (31)



మిచెల్ మార్ష్ 72 (36)



పూరన్ 75 (30)

- రాణించిన డుప్లెసిస్, స్టబ్స్, విప్‌రాజ్ నిగమ్..
- లఖ్‌నవూ బ్యాటింగ్‌లో మిచెల్ మార్ష్, పూరన్ మెరుపులు
- సిక్సర్లతో హోరెత్తిన స్టేడియం
- పేలవమైన బ్యాటింగ్‌తో నిరాశపరిచిన రిషబ్ పంత్

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. చివరి ఐదు ఓవర్లలో మ్యాచ్‌ను ఊహించని మలుపుతిప్పి జట్టుకు అద్భుతమైన విజయాన్నందించిన అశుతోష్ శర్మను ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందించారు. చివరి ఓవర్‌లో ఆరు పరుగులు చేయాల్సి ఉండగా...మూడో బంతిని అశుతోష్ శర్మ సిక్సర్‌గా మలచాడు. ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మెన్‌లో మార్ష్ మొదటి ఓవర్ చివరి బంతిని సిక్సర్‌గా మలిచి ఖాతా తెరిచాడు. స్టార్క్ వేసిన రెండో ఓవర్‌లో మక్రమ్, మార్ష్ చెరో సిక్సర్ బాది స్టేడియాన్ని హోరెత్తించారు. ఐదో ఓవర్‌లో నిగమ్ వేసిన బంతిని మక్రమ్ లాంగ్ ఆఫ్ మీదుగా సిక్సర్ కొట్టేందుకు యత్నించి అవుటయ్యాడు. అదే ఓవర్‌లో ఎల్ఎస్‌జీ 50 పరుగులు పూర్తిచేసింది. ఓపెనర్ మార్ష్ 21 బంతుల్లో ఐదు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తరువాత ఓవర్‌లో మార్ష్ డీప్ వికెట్ మీదుగా సిక్సర్ కొట్టగా, మరో ఎండ్‌లోని పూరన్ వరుసగా మూడు సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరిగెత్తించాడు. మిచెల్ మార్ష్ కేవలం 36 బంతుల్లో ఆరు బౌండరీలు, ఆరు సిక్సర్లతో 72 పరుగులు చేసి ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో స్టబ్స్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. మ్యాచ్ 13వ ఓవర్‌లో ఢిల్లీ బౌలర్ స్టబ్స్‌ను పూరన్ ఊచకోత కోశాడు. మిడాన్, మిడాఫ్, లాంగ్ ఆన్ మీదుగా వరుసగా నాలుగు సిక్సర్లతోపాటు మరో బౌండరీ బాది 30 పరుగులు రాబట్టాడు. ఆ



కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్

... మిగతా 6వ పేజీలో



స్టేడియంలో అభిమానుల కేరింతలు

సూపర్ బజార్ ఎండీ సరండర్

ఆరోపణలపై ఎట్టకేలకు స్పందించిన ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- లోపాలను కప్పిపుచ్చిన ఆడిటర్లపై చర్యలు లేవా!?
- జిల్లా సహకార శాఖాధికారిణికి అదనపు బాధ్యతలు



సూపర్ బజార్ ఎండీ శ్రీనివాసరాజు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజారు) మేనేజింగ్ డైరెక్టర్ డి.శ్రీనివాసరాజును ఎట్టకేలకు ఉన్నతాధికారులు ఆ పోస్టు నుంచి తప్పించి విజయవాడలోని సహకార శాఖ కమిషనరేట్‌కు సరండర్ చేశారు. సూపర్ బజార్ ప్రాంగణంలో స్థలం లీజుకు తీసుకున్న సుహానీ కంపెనీ... దానిని బ్యాంకులో తనఖా పెట్టి రూ.300 కోట్ల రుణం తీసుకొని తిరిగి కట్టకపోవడం, దాంతో సూపర్ బజారుకు నోటీసులు అందడం తెలిసిందే. ఈ వ్యవహారాలన్నీ గత మూడేళ్లుగా జరుగుతున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకుండా మేనేజ్ చేసుకుంటూ వస్తున్నారు. చివరకు బ్యాంకు జప్తు నోటీసులు ఇవ్వడంతో అసలు విషయం బయటపెట్టారు.

నాలుగేళ్లుగా ఎండీగా ఉన్న శ్రీనివాసరాజు అంతకు ముందు కూడా అదే పోస్టులో సుమారు నాలుగేళ్లకు పైగా పనిచేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్‌కు చాలా విషయాలు చెప్పకుండా గోప్యత పాటించారు. ఇటీవల ఇవన్నీ బయటకు రావడంతో విచారణ మొదలైంది. ఈ నేపథ్యంలో ఎండీ శ్రీనివాసరాజుపై సిబ్బందిలో కొందరు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాలుగేళ్లుగా భవనం మరమ్మతుల పేరుతో ఏటా రూ.5 లక్షల వరకు బిల్లులు పెట్టి తీసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే కంటింజెన్సీ అని, ఆఫీస్ నిర్వహణ అని దొంగ బిల్లులతో సంస్థ నిధులు కాజేస్తున్నారని అందులో పేర్కొన్నారు. బ్యాంకులో ... మిగతా 6వ పేజీలో

పాఠశాలలకు షాక్

- పక్షం రోజుల్లో బకాయిలు చెల్లించాలంటూ ఈపీడీసీఎల్ నోటీసులు
- హెచ్ఎంల ఆందోళన

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలలు విద్యుత్ బిల్లులు చెల్లించనక్కర్లేదని ప్రభుత్వం ప్రకటించినా... బకాయిలు చెల్లించాలంటూ ఈపీడీసీఎల్ తాజాగా నోటీసులు జారీ చేస్తోంది. బకాయిలు 15 రోజుల్లో చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నోటీసులో స్పష్టంచేసింది. ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో 586 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల నిర్వహణకు గతంలో ఏటా ప్రభుత్వం నిధులు ఇచ్చేది. వాటి నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ భూమికి ఎసరు

ఆనందపురం మండలం ముచ్చెర్లలో 87.6 ఎకరాలను అమ్మకానికి పెట్టిన వైనం

- పలువురి నుంచి అడ్వాన్స్‌లు
- ప్రభుత్వం దృష్టికి వ్యవహారం
- ముచ్చెర్ల అన్‌సెటిల్ గ్రామంగా పేర్కొంటున్న తహసీల్దార్



సర్వేనంబరు 13లో ఉన్న తోటలు

విశాఖపట్నం/ఆనందపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం ముచ్చెర్ల గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆ ప్రాంతానికి చెందిన ఒకరు బేరం పెట్టడం కలకలం రేపుతోంది. విజయనగరం సంస్థానం నుంచి తమకు వారసత్వంగా వచ్చిన భూమిగా పేర్కొంటూ పలువురి నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ అధికారుల సమాచారం ప్రకారం ముచ్చెర్ల అన్‌సెటిల్ గ్రామం. పూర్వం విజయనగరం సంస్థానాన్ని పాలించిన పూసపాటి వంశీయుల ఆధీనంలో ఈ గ్రామం ఉండేది. అప్పట్లో తమ భూములు సర్వే చేయాల్సిందిగా మద్రాస్ ప్రెసిడెన్సీలో సర్వేయర్‌గా ఉన్న హెచ్‌జే గిల్‌మన్‌ను పూసపాటి వంశీయులు కోరారు. 1901 నుంచి 1903 వరకు గిల్‌మెన్ ఈ ప్రాంతంలో సర్వే చేసి విజయనగరం పూసపాటి వంశీయుల భూములపై రికార్డు రూపొందించారు. గిల్‌మన్ సర్వే చేసిన గ్రామాల్లో ముచ్చెర్ల కూడా ఉంది. అయితే అప్పట్లో విజయనగరం రాజుల నుంచి భూములను కొందరు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకునేవారు. మరికొందరికి రాజులే భూములు దానం చేశారు. రానురాను గ్రామంలో చాలావరకూ భూములు రైతుల ఆధీనంలో ఉండగా, మరికొన్ని ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. కొందరు రైతుల ఆధీనంలో ఉన్న భూములను ఒక మాజీ ప్రజా ప్రతినిధి అనధికారికంగా కొనుగోలు ... మిగతా 6వ పేజీలో

క్యాంపు రాజకీయాలు

మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి కూటమి నోటీస్ ఇవ్వడంతో బెంగళూరుకు వైసీపీ కార్పొరేటర్లు తరలింపు

- కుటుంబాలతో సహా వెళ్లిన 28 మంది...
- కూటమి కార్పొరేటర్లకు వైసీపీ నేతల గాలం
- కూటమి నేతల మల్లగుల్లాలు
- 29న బడ్జెట్ సమావేశం అనంతరం తమ కార్పొరేటర్లను ఎక్కడికైనా తరలించాలని యోచన



ఎయిర్‌పోర్టుకు వెళుతున్న వైసీపీ కార్పొరేటర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీస్ అందజేయడంతో రాజకీయం వేడెక్కింది. ఇరువర్గాలూ కార్పొరేటర్లను కాపాడుకునే పనిలో పడ్డాయి. అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఇంకా తేదీని నిర్ణయించకముందే వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను బెంగళూరు తరలించేశారు.

నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ అత్యధిక వార్డులను గెలుచుకోవడంతో 11వ వార్డు నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందిన గొలగాని హరివెంకటకుమారి మేయర్ అయ్యారు. అయితే గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారం చేజిక్కించుకోవడంతో జీవీఎంసీలో బలాబలాలు మారిపోయాయి. వైసీపీ ఆధిక్యం తగ్గిపోయి, కూటమి మెజారిటీ పెరిగింది. ఈ నేపథ్యంలో మేయర్ హరివెంకటకుమారిపై అవిశ్వాసం తీర్మానానికి కూటమికి చెందిన 70 మంది కార్పొరేటర్లు ఈనెల 22న జిల్లా కలెక్టర్‌కు నోటీస్ అందజేశారు. నోటీస్‌లో ఉన్న కార్పొరేటర్ల సంతకాలను వెరిఫై చేసి తనకు నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జీవీఎంసీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన నోటీస్‌లో సంతకాలు చేసిన కార్పొరేటర్లతో మాట్లాడి, అవి వారే చేసినట్టు నిర్ధారించుకున్నారు. దీనిపై కలెక్టర్‌కు మంగళవారం నివేదిక ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అమరావతిలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు జిల్లా కలెక్టర్ల సమావేశం ఉండడంతో ఆయన అందుబాటులో లేరు. కలెక్టర్ తిరిగి నగరానికి వచ్చిన తర్వాత నివేదికను అందజేస్తే, అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం ఎప్పుడు ... మిగతా 6వ పేజీలో

పెందుర్తిలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పెందుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం జిల్లా పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. విశాఖ నుంచి బొగ్గు లోడుతో పలాస వెళుతున్న గూడ్స్ రైలు పెందుర్తి రైల్వేస్టేషన్-సరిపల్లి బ్రిడ్జికి మధ్య పట్టాలు తప్పింది. దీంతో రైల్వే ట్రాక్ కాంక్రీట్ స్లీపర్లు ఒరిగి పట్టాలు కుంగిపోయాయి. సింగిల్ డౌన్ గూడ్స్ ట్రాక్ కావడంతో రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్

- నిరంతరం ఎగిరేలా చూస్తామన్న పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్
- గత మూడు వారాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచాం
- సాగర్‌నగర్ బీచ్‌ను కూడా అభివృద్ధి చేస్తాం
- ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి



బ్లూ ఫ్లాగ్ ఎగురవేత కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేశ్. పక్కన ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి. ఇతర అధికారులు.

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ నిరంతరం ఎగురుతుందని, ఆ దిశగా అనేక చర్యలు చేపడుతున్నామని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. సోమవారం రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్‌ను ఎగురవేసిన అనంతరం ఆయన అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ, పర్యాటక శాఖ గత ... మిగతా 6వ పేజీలో

గెడ్డలో వ్యర్థాల తొలగింపు



గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

వడ్లపూడి వాసుల హర్షం

కూర్మన్నపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

వడ్లపూడి గెడ్డలో వ్యర్థాలను ఎట్టకేలకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. దుర్గంధంతో సతమతమవుతున్న కాలనీవాసులకు ఉపశమనం కల్పించారు. జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్‌లో 'ఆంధ్రజ్యోతి' జనవరి 28వ తేదీన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం నిర్వహించింది. వడ్లపూడిలో ప్రధాన గెడ్డకు ఎగువ నుంచి వస్తున్న మురుగు అడ్డంకుల వల్ల నిలిచి పోవడంతో దుర్గంధం వెలువడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. సమస్యను ... మిగతా 6వ పేజీలో

ఆంధ్రజ్యోతి
అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (మంగళవారం సాయంత్రం)

సహర్ : 4.40 (బుధవారం ఉదయం)



వీధి లైట్ల వెలుగులో కాలనీ

కృష్ణానగర్‌లో వీధి లైట్లు ఏర్పాటు

మధురవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని ద్రోణంరాజు కల్యాణ మండపం, కృష్ణానగర్ కాలనీలో అధికారులు ఎట్టకేలకు వీధి లైట్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో కొన్నేళ్లుగా వీధి లైట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయాన్ని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి నాగోతి సూర్యప్రకాశరావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సంబంధిత అధికారులతో మాట్లాడి, లైట్లు వేయించారు.

దుర్గానగర్‌లో పార్క్ పనులకు శంకుస్థాపన

మధురవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని దుర్గానగర్ కాలనీలో పార్క్ నిర్మాణానికి కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ. 37 లక్షలతో పార్కు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, నాయకులు నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన నాయుడు, పోతిన ప్రసాద్, జనసేన వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింగనాయుడు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో రీసర్వేకు జేసీ ఆదేశం

- నియోజకవర్గంలో మూడు గ్రామాల్లో సమస్య
- నేటి నుంచి రీసర్వే జరిగే అవకాశం
- ప్రత్యేక అధికారుల నియామకం



దాకమర్రిలో రీసర్వే చేయాల్సిన భూమి

భీమునిపట్నం (రూరల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలంలోని దాకమర్రి, పద్మనాభంలోని గంధవరం, ఆనందపురంలోని గొట్టిపల్లి పంచాయతీల్లో వివాదాస్పదమైన భూముల్లో రీసర్వే చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశోక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఆయా గ్రామాల్లో కొన్ని కుటుంబాలకు చెందిన వారు రీసర్వేను అడ్డుకున్నారు. దీంతో అధికారులు సర్వే పనులను నిలిపివేశారు. రైతులు మళ్లీ గ్రామాల్లో భూములను రీసర్వే చేయాలని జేసీని కోరడంతో రీసర్వేకు సన్నద్ధమవుతున్నారు. గతంలో రీసర్వే నిలిచిపోవడానికి కొన్ని కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదాలే కారణమని గుర్తించిన జేసీ సంబంధిత వ్యక్తులతో ముందుగా సమావేశాలు జరిపిన తరువాత రీ సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భీమిలి మండలానికి చెందిన ఇద్దరు సర్వేయర్లు, ఆర్ఐకు ఈ బాధ్యతలను తహసీల్దార్ రామారావు అప్పగించారు. మంగళవారం నుంచి రీసర్వే జరిగే అవకాశం ఉంది.

కాగా భీమిలిలోని తాళ్లవలస. తాటితూరు గ్రామాల్లో నిలిచిపోయిన రీ సర్వేను మంగళవారం నుంచి ప్రారంభించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. గతంలో కొంతవరకు జరిగిన ఈ సర్వే వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఆయా గ్రామాల రైతులు రీ సర్వే చేపట్టాలని కొంతకాలంగా కోరుతున్నారు. దీనిపై స్పందించిన అధికారులు తాళ్లవలసలో ఉదయం, తాటితూరులో మధ్యాహ్నం సర్వే చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. సర్వేకు ముందు గ్రామ సభ ఉంటుంది.

సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు

తగరపువలస, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో సమస్యలను తెలుసుకోవడానికి సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం నుంచి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. ఈమేరకు రెండో వార్డు లో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ఇళ్ల ఎవరికి రాలేదు, కొత్తగా పింఛన్లు మంజూరు కావాల్సిన వారు, ఆగిపోయిన పింఛన్లు వంటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 12 వార్డుల్లో పర్యటన తరువాత ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఆర్.నరసింగరావు ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి శివాజీపాలెం నివాసి దువ్వి అప్పారావు, సన్యాసిరావు సోదరులు సతీసమేతంగా రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను చెక్ రూపంలో పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు సోమవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో మూల విరాట్ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

28న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మి కుల తొలగింపునకు నిరసనగా ఈనెల 28న సమ్మె చేపట్టనున్నామని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. సోమవారం రాత్రి టౌన్‌షిప్‌లో జరిగిన సమావేశంలో నాయకులు ఈమేరకు తీర్మానం చేశారు. ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడ్ని తొలగించరాదని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేయనున్నామని చెప్పారు. 26న ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిగే క్రమంలో ఆర్ఎల్‌సీ కార్యాలయం వద్ద నిరసన చేస్తామని తెలిపారు. 28న ఉదయం ఆరు నుంచి 29న ఉదయం ఆరు గంటల వరకు సమ్మె చేస్తామ న్నారు.

7వ తేదీ నుంచి సమ్మేటివ్ పరీక్షలు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు వచ్చేనెల 7 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు 7 నుంచి 17 వరకు, 9వ తేదీ నుంచి 15 వరకు ప్రాథమిక తరగతులకు పరీక్షలు నిర్వహిస్తారు. 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించారు.

అల్లూరిపై సినిమా : దర్శకుడు కృష్ణవంశీ



అల్లూరి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న దర్శకుడు కృష్ణవంశీ, యండమూరి

కొయ్యూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి చరిత్రకు సంబంధించిన మరిన్ని అంశాలతో సినిమా తీయాలనే ఆలోచన ఉన్నట్టు దర్శకుడు కృష్ణవంశీ తెలిపారు. ఆయన సోమవారం ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌తో కలిసి అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి స్మారక పార్కును సందర్శించారు. అల్లూరి, గంటందొరల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రకు సంబంధించి పార్కులో ఉన్న శిలాఫలకాలను పరిశీలించారు. అక్కడ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బట్టపణుకుల పంచాయతీ లంకవీధి వెళ్లి అల్లూరి అనుచరులైన గాం గంటం దొర, మల్లుదొర వారసులను పరామర్శించారు. వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. గంటందొర జీవిత విషయాల గురించి ఆరా తీశారు. 'నేను సైతం' ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివప్రసాద్ సమకూర్చిన చీరలు, దుప్పట్లను గంటందొర కుటుంబీకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ అల్లూరిపై కొత్తపంథాలో సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. గంటందొర, మల్లుదొరలకు చెందిన జీవిత విశేషాలు, స్వాతంత్ర్యం సాధనలో వారి పాత్రను భావితరాలకు తెలిసేలా సినిమాకు రూపకల్పన చేస్తామన్నారు. అల్లూరి చరిత్రపై 20 ఏళ్ల రీసెర్చ్ చేసిన గోకరాజు నారాయణ రావు రచన ఆధారంగా చేసుకుని సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. రచయిత వీరేంద్రనాథ్ మాట్లాడుతూ అల్లూరి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

చేసి తన ఆధీనంలో ఉంచుకున్నారు. మరి కొంత భూమిని రైతులు సాగు చేస్తూ జీడి, మామిడి తోటలు పెంచుకున్నారు. అయితే పూసపాటి వంశీయుల నుంచి దఖలు పడినట్టు కొందరు డాక్యుమెంట్లు సృష్టించి భూముల స్వాధీనానికి యత్నించడం, రైతులు ప్రతిఘటించడం, తదితర కారణాలతో గ్రామాన్ని అన్‌సెటిల్‌గా రెవెన్యూ శాఖ గుర్తించింది. గ్రామంలోని సర్వే నంబరు 2 నుంచి 36 వరకు మొత్తం 125 ఎకరాలను 2017లో జిల్లా యంత్రాంగం ప్రభుత్వ నిషేధ భూముల జాబితా (22-ఎ)లో చేర్చింది. ఈ మేరకు ఆనందపురం తహసీల్దార్ ఒక సర్క్యులర్ జారీచేశారు. అలాగే సర్వేనంబర్ 13లో 87.6 ఎకరాల బంజరు ఉండగా, అందులో సుమారు 41.89 ఎకరాలకు గ్రామంలో భూమి లేని పేదలకు చాలాకాలం క్రితమే ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇంకా 45.71 ఎకరాల భూమి బంజరుగా ఉంది. కొందరు రైతులు ఈ భూమిలో జీడి, మామిడి తోటలు పెంచుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదిలావుండగా నగరానికి ఆనుకుని ఉన్న ఆనందపురం మండలంలో భూములకు విలువ పెరగడంతో అదే ప్రాంతానికి చెందిన ఒకరు రంగంలోకి దిగి 22-ఎలో ప్రభుత్వ బంజరుగా ఉన్న 45.71 ఎకరాలు, పేదలకు పట్టాలు ఇచ్చిన భూమి సుమారు 41.89 ఎకరాలు మొత్తం..87.6 ఎకరాలు విజయనగరం సంస్థానం నుంచి తమకు దఖలు పడిందని పేర్కొంటూ, వాటిని విక్రయించేందుకు కొద్దికాలంగా అడ్వాన్స్‌లు తీసుకున్నారు. అడ్వాన్స్‌లు ఇచ్చిన పలువురు ఆ తరువాత ఆనందపురం మండల తహసీల్దారు కార్యాలయం అధికారులను సంప్రతించగా అసలు విషయం తెలిసింది. ముచ్చెర్ల గ్రామంలో సర్వే నంబర్ 13లో మొత్తం బంజరుగా ఉందని, గతంలో 40 ఎకరాలకుపైగా పేదలకు పట్టాలు ఇచ్చామని వివరించారు. అయినా తాజాగా సదరు దళారి మరికొందరిని మోసంచేసి అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు గుర్తించిన కొందరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా ముచ్చెర్ల అన్ సెటిల్ గ్రామం అని పేర్కొన్నారు. అటువంటప్పుడు భూములు కొనుగోలు చేసేవారంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వే నంబర్ 13లో ఉన్న 45.71 ఎకరాలను 2017లో 22-ఎలో చేర్చామని, అది ప్రభుత్వ బంజరు అని స్పష్టంచేశారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై విచారణ జరిపాలి : సీపీఐ

మధురవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని దివ్యాంగుల కాలనీలో నకిలీ పట్టాలతో పలువురు క్రయ విక్రయాలు జరుపుతున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. సోమవారం ఆయన జోన్ - 2 కార్యాలయంలో జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 136 మంది దివ్యాంగులకు 96 గజాలు చొప్పున ఇళ్లు నిర్మించుకోడానికి దివ్యాంగుల కాలనీలో స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. అప్పట్లో కాలనీ దూరంగా ఉందని, మౌలిక సదుపాయాలు లేవని, కొందరు ఇళ్లు నిర్మించుకోలేదని, దీన్ని అవకాశంగా తీసుకొన్న కొందరు ఖాళీ స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించారని చెప్పారు. అసలైన లబ్ధిదారులు తమ స్థలాల వద్దకు వస్తే వారిని నకిలీ పట్టాల ముఠా బెదిరిస్తుందన్నారు.

'పీఎఫ్ వివరాల్లో తప్పులు సవరించాలి'

తగరపువలస, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లులో మారుపేరుతో పని చేసిన కార్మికులకు పీఎఫ్ వివరాల నమోదులో తప్పులు సవరించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కార్మిక ఐక్య కార్యాచరణ సమితి నాయకులు కోరారు. సోమవారం వారు నగరంలో పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల కొత్తగా పీఎఫ్ వివరాల నమోదుకు, పొరపాట్ల సవరణకు అవకాశం కల్పించిందని, ఈమేరకు మిల్లులో మారుపేరులో పని చేసిన కార్మికుల పీఎఫ్ వివరాల్లో జరిగిన తప్పుల సవరణకు అవకాశం కల్పించాలన్నారు.

అదరగొట్టిన అశుతోష్

... 5వ పేజీ తరువాయి

తరువాత క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రిషబ్‌పంత్ ఆరు బంతులు ఆడి పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. పూరన్ కేవలం 30 బంతుల్లో ఆరు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 75 పరుగులు చేసి స్టార్క్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ మోహిత్ బౌలింగ్‌లో చివరి రెండు బంతులను మిల్లర్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టడంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. 210 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోవడంతో గ్యాలరీలలోని ప్రేక్షకులలో ఉత్సాహం తగ్గింది. డుప్లెసిస్ (29), కెప్టెన్ అక్షర పటేల్ (22), స్టబ్స్ (34) కొద్దిసేపు మెరిశారు. స్టబ్స్ అవుట్‌తో మ్యాచ్ ఢిల్లీ చేజారిందని అందరూ భావించారు. ఆ సమయంలో అశుతోష్‌శర్మ అజేయ అర్ధ సెంచరీ (66 నాటౌట్), విప్‌రాజ్ నిగమ్ (39) మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు.

ఘనంగా నూకాలమ్మ పొలిమేర ఉత్సవం



అమ్మవారి ప్రతిరూపం తంగేటిపూల గరగ ఊరేగింపు

భీమునిపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూకాలమ్మ పొలిమేర ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అయిదున్నర గంటలకు లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్ ఆవరణలో ఉన్న అమ్మవారి చదురుపట్టు నుంచి అమ్మవారి ప్రతిరూపం తంగేటి పూలగరగకు ఆలయ పూజారి చౌదరి సత్యరాజ్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం డప్పు వాయిద్యాలతో పూలగరగను చదురుపట్టు నుంచి పూజారి తొడ్కొని వచ్చి అమ్మోరమ్మకు అందజేశారు. భక్తుల దర్శనాలు తరువాత పొలిమేర ఉత్సవం ప్రారంభమైంది. గౌడవీధి, సుభాష్ రోడ్, చిన్నబజారు, కేటీస్‌పేట, ఎల్లమ్మపేట, కుమ్మరిపాలెం ఎల్లారమ్మ ఆలయం మీదుగా మధ్యాహ్నానికి అమ్మవారు స్మిత్‌వీధిలో కర్రోతు వారి ఇంటికి చేరింది. అక్కడ సేదతీరిన తర్వాత సాయంత్రం మళ్లీ పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పురవీధుల మీదుగా అమ్మవారిని రాత్రికి చదురుపట్టుకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటేష్, మారుతి, నాయకులు గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు, గొలగాని నరేంద్రకుమార్, మైలపల్లి లక్ష్మణరావు, కంటుభుక్త ముత్యాలరావు, ఆనంద్, అప్పికొండ నూకరాజు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే క్షయ నిర్మూలన



భీమిలిలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది ర్యాలీ

భీమునిపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం. ఫణికుమార్ మాట్లాడుతూ క్షయపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. రెండు వారాలకు మించి కఫంతో కూడిన దగ్గు ఉన్నట్టుయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్ష ద్వారా వ్యాధి ఉందో లేదో నిర్ధారణ చేసుకోవచ్చన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు గోవింద్, ప్రతిభ, సురేఖ, క్షయ విభాగం సూపర్‌వైజర్ ఇస్సా తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో...

తగరపువలస : సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో సోమవారం క్షయ నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయితేజ మాట్లాడుతూ క్షయ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రోగులు మందులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డా. పి. సుధాకర్, సూపరింటెండెంట్ డా. ప్రతిమాదేవి, క్షయ విభాగం అధిపతి డా. రవీంద్రబాబు పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఎండీ సరండర్

... 5వ పేజీ తరువాయి

డిపాజిట్లు కూడా క్రమంగా తగ్గిపోయాయని ఆరోపించారు. ఆడిట్ అధికారులు కూడా సహకరిస్తున్నా రని పేర్కొన్నారు. వీటన్నింటిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జిల్లా సహకార శాఖాధికారిణి ప్రవీణ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. దాంతో సూపర్ బజారు ఎండీ పోస్టు నుంచి శ్రీనివాసరాజును తప్పించి కమిషనరేట్‌కు సరండర్ చేశారు. ప్రవీణే కొంతకాలం ఎండీగా అదనపు బాధ్యతలుగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎండీ అక్రమాలకు సహకరించిన ఆడిటర్లపై చర్యలు ఏమీ చేపట్టరా?, వారు నిర్వహించిన ఆడిట్ లోపాలు బయట పెట్టరా? అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. సహకార శాఖ చాలా వరకూ లోపాలమయం కావడంతో ఒకరి జాతకం బయటపెడితే మరొకరికి ఇబ్బంది వస్తుందని,ఒకరికి మరొకరు సహకరించుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సూపర్ బజార్ అక్రమాలపై లోతైన విచారణ చేసి బాధ్యులందరిపై చర్యలు చేపట్టాల్సి ఉంది.

రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్

... 5వ పేజీ తరువాయి

మూడు వారాల్లో బీచ్‌లో మౌలిక వసతులు మెరుగుపరిచిందన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. పార్కింగ్‌కు కూడా అదనపు స్థలం కేటాయించామన్నారు. ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి మాట్లాడుతూ, త్వరలో బీచ్ నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించినా ఎవరు వస్తున్నారు?, ఎలా వస్తున్నారు? తదితర విషయాలను సీసీ టీవీ కెమెరాలతో పర్యవేక్షించడానికి టెక్నాలజీ ఉపయోగించుకుంటామన్నారు. సాగర్‌నగర్ బీచ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి గంటా రవితేజ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏపీటీడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్‌డీ జగదీశ్, జిల్లా పర్యాటక శాఖాధికారి సుధాసాగర్, జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్, తదితరులు పాల్గొన్నారు. బీచ్‌లో పర్యాటకులను కాపాడే వారికి రక్షణ పరికరాలు అందించారు.

క్యాంపు రాజకీయాలు

... 5వ పేజీ తరువాయి

చేయాలనేది తేదీని నిర్ణయిస్తారు. సమావేశం నిర్వహించాలనుకున్న రోజుకు కనీసం 15 రోజులు ముందు కార్పొరేటర్లకు సమాచారం అందజేయాల్సి ఉంటుంది. దీనినిబట్టి అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం జరగాలంటే కనీసం మరో 20 రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను క్యాంపునకు తరలించడం చర్చనీయాంశంగా మారింది. అవిశ్వాసతీర్మానంపై సమావేశం మరో 20 రోజుల వరకు జరిగే అవకాశం లేదు. అంతేకాకుండా ఈనెల 29న బడ్జెట్ సమావేశం ఉన్నందున కార్పొరేటర్లంతా ఆ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఇప్పటి నుంచే కార్పొరేటర్లను బెంగళూరు క్యాంపునకు తరలించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆ పార్టీ నేతలు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

బెంగళూరుకు 28 మంది..

వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను కూటమి వైపు ఆకర్షితులు కాకుండా ముందు జాగ్రత్తగా బెంగళూరు క్యాంపునకు రూపకల్పన చేశారు. వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ వారిలో సుమారు 30 మంది ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. మిగిలిన 29 మందిలో సోమవారం 28 మంది బెంగళూరు వెళ్లినట్టు సమాచారం. మూడు విడతల్లో విశాఖ నుంచి విమానంలో బెంగళూరు తరలించారు. కార్పొరేటర్లతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా క్యాంపునకు వెళ్లడం విశేషం. ఇదిలావుండగా వైసీపీ కార్పొరేటర్లు పార్టీని వీడకుండా ఉండేందుకు భారీగా నజరానా ఇస్తామని ఆశ చూపినట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వైసీపీని వీడి కొన్నాళ్ల కిందట కూటమి పార్టీల్లో చేరిన వారిని తిరిగి వెనక్కి రప్పించుకునేందుకు నేతలు వ్యూహరచన చేస్తున్నారు. అందులోభాగంగా ముగ్గురు కార్పొరేటర్లతో సంప్రతింపులు జరుపుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తమ కార్పొరేటర్లను కూడా బడ్జెట్ సమావేశం తరువాత ఎక్కడికైనా తరలిస్తేనే బాగుంటుందని కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల గడువు పెంపు

పద్మనాభం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బీసీ రుణాల దరఖాస్తుల గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్టు ఎంపీడీఓ విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తొలుత దరఖాస్తుల గడువును ఈనెల 22 వరకు ఇవ్వగా అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దాన్ని 25 వరకు పొడిగించిందన్నారు. అలాగే కాపు కార్పొరేషన్ రుణాలకు గరిష్ఠ వయస్సు 50 నుంచి 60 ఏళ్లకు పొడించారని తెలిపారు. వారు కూడా ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'అభివృద్ధికి సహకరించాలి'

సాగర్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తీర ప్రాంతాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఏపీ టీడీసీ ఛైర్మన్ ఎన్.బాలాజీ అన్నారు. సోమవారం ఆయన రుషికొండ బీచ్‌లో విలేకరులతో మాట్లాడారు. బ్లూ ఫ్లాగ్ బీచ్ నిర్వహణ సక్రమంగా ఉన్నప్పుడే ఇతర దేశస్తులు బీచ్‌కు వస్తారని చెప్పారు. గతంలో కొంత నిర్లక్ష్యం జరిగినప్పటికీ ప్రభుత్వం మళ్లీ శ్రద్ధ తీసుకోవడం వల్లే బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణ జరిగిందన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు వినతులు

భీమునిపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. జడ్సీ ప్రసన్నవాణి ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజనీరింగ్ విభాగానికి, యూసీడీ విభాగానికి ఒక్కొక్కటి చొప్పున, రెవెన్యూ విభాగానికి 2 అర్జీలు అందాయి.

'పేదల పట్ల నిర్లక్ష్యం తగదు'



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కొమ్మాది, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అధికారులు పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మధురవాడ జోన్ సీఐటీయూ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు అన్నారు. సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొమ్మాది దేవి మెట్ట రోడ్డులోని ఎస్సీ కాలనీవాసులు జోన్ 2 కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో 30 ఏళ్లుగా ప్రజలు నివసిస్తున్నా.. అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.ముఖ్యంగా వీధిలైట్లు, మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. త్వర లోనే కాలనీలో పర్యటించి, మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేస్తామని జడ్సీ వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైడితల్లి, ఐద్వా నాయకులు కె. పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో వార్డులో సమస్యలు పరిష్కరిస్తాం

భీమునిపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు చేపలుప్పాడ ఎస్సీ కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాలు మరమ్మతు, చేపలుప్పాడలో తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్యలను పరిష్కరిస్తామని జోనల్ పబ్లిక్ వర్క్స్ ఏఈఈ సురేశ్ తెలిపారు. సోమవారం ఆయన టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాసి నరసింగరావుతో కలిసి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే రెండు నెలల్లో ఆయా పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రినాథ్ కుమార్, రాము, అప్పారావు, సూరాడ రవి పాల్గొన్నారు.



వార్డులోని అభివృద్ధి పనులపై ఏఈఈ సురేశ్‌తో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

'దేశ అభ్యున్నతిలో యువత భాగస్వామ్యం అవసరం'

సాగర్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గీతం వర్సిటీలో సోమవారం నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి ఇ. రవికిరణ్ మాట్లాడుతూ యువత పార్లమెంటరీ విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంతో పాటు జాతీయ సమస్యలపై క్రమశిక్షణతో కూడిన చర్చలను ప్రోత్సహించడం, విభిన్న అభిప్రాయాలను గౌరవించే సంస్కృతిని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, ప్రొఫెసర్ హనీఫ్‌ద్దీన్, ఎన్‌వీకే డిప్యూటీ డైరెక్టర్ జి. నాగేశ్వరరావు, స్కూల్ ఆఫ్ జర్నలిజం వైస్ ఛైర్మన్ ఎన్. నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గెడ్డలో వ్యర్థాల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

పరిష్కరించాలని కార్యక్రమానికి హాజరైన స్థానిక కార్పొరేటర్ బొండా జగన్, ఇతర అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ జగన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్ చొరవతో సోమవారం ఎస్కవేటర్‌తో గెడ్డలో వ్యర్థాలను తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో తమ సమస్య పరిష్కారమైందనీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలకు షాక్

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాఠశాలల నిర్వహణకు సక్రమంగా నిధులు మంజూరుచేయలేదు. దాంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. నెలకు ప్రాథమిక పాఠశాలకు రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేలు, ఉన్నత పాఠశాలలకు రూ. ఐదు వేల నుంచి రూ.15 వేలు బిల్లులు వస్తున్నాయి. ఒకపక్క నిర్వహణ గ్రాంటు ఇవ్వకపోవడం, మరోవైపు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ప్రధానోపాధ్యాయులు సమస్యను గత ప్రభుత్వంలో విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. పాఠశాలలు విద్యుత్ బిల్లులు చెల్లించనక్కర్లేదని ఆయన చెప్పడంతో గండం గట్టెక్కిందని హెచ్‌ఎంలు ఊపిరిపీల్చుకున్నారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి కూడా పాఠశాలల విద్యుత్ బిల్లులపై చర్చ వచ్చినప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పింది. అంతే కాకుండా పాఠశాలల నిర్వహణకు గత ఏడాది, తాజాగా నిధులు విడుదల చేసింది. అయితే ఆ నిధులు పాఠశాలల నిర్వహణకు మాత్రమే సరిపోతాయని టీచర్లు చెబుతున్నారు. కాగా బకాయిలు చెల్లించాలని రెండు, మూడు రోజుల నుంచి పాఠశాలలకు నోటీసులు రావడంతో అంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.పాఠశాల స్థాయి బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు బకాయి నోటీసులు అందాయి. సింహాచలం బీసీ గురుకుల పాఠశాలకు రూ.5.5 లక్షల డిమాండ్ నోటీస్ అందింది. విద్యుత్ బకాయిలు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలను హెచ్‌ఎంలు కోరుతున్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న జడ్సీ శేషాద్రి

పీజీఆర్ఎస్‌కు 21 వినతులు

గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 21 వినతులు వచ్చాయి. వీధి లైట్లు వెలిగేలా చూడాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, రోడ్లపై గోతులను పూడ్చాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, తదితర సమస్యలపై పలువురు అర్జీలను అందజేశారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జోనల్ కమిషనర్ శేషాద్రి ఆదేశించారు.

వేపగుంట జోనల్ కార్యలయంలో 9..

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 వినతులు అందాయి. వీటిని సంబంధితశాఖలకు పంపించి తగిన చర్యలు చేపడతామని జడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

సీపీఐ ధర్నా

గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టిడ్కో లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు సేల్ డీడ్‌లను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులకు సేల్ డీడ్‌లు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు సీపీప నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అప్పలరాజు, భాస్కరరావు, తిరుమలరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సంపత్ వినాయకుని సన్నిధిలో భక్తులు

గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి మెహర్‌నగర్‌లోని శ్రీసంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

పెందుర్తిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చీమలాపల్లి వేదమాత గాయత్రీ దేవి ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ధర్మకర్త కెంగం రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో మండపార్చనలు, వేద పారాయణ, సూర్యనమస్కారాలు, రుద్రాభిషేకం, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 28, బంగాళదుంపలు 15, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 28, అల్లం 50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 26, వెల్లుల్లి 110, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్యారపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176



అర్ధంతరంగా నిలిచిపోయిన బర్నింగ్ యూనిట్ల భవన నిర్మాణాలు



ముస్లింల శ్మశానవాటిక కోసం కేటాయించిన స్థలం

ఆధునికీకరణ పనులను ఆపేశారు..

- అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్న శ్మశానవాటిక
- అధికారులు స్పందించి పనులను త్వరితంగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

పెదగంట్యాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ శ్మశానవాటిక ఆధునికీకరణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. స్మార్ట్ సిటీ హోదాకు తగ్గట్టుగా ఆధునిక హంగులతో ఇక్కడ శ్మశానవాటికను ఏర్పాటు చేస్తామని 2021లో జీవీఎంసీ అధికారులు ప్రకటించడంతో పాటు రూ.3.5 కోట్లు కేటాయించారు. ఆధునిక ప్లాట్‌ఫారాలతో కూడిన రెండు బర్నింగ్ యూనిట్లు, ఒక ఎలక్ట్రికల్ బర్నింగ్ యూనిట్, అంతిమ సంస్కారం చేసేందుకు వచ్చినవారు వేచివుండేందుకు భవనంతో పాటు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే ఇక్కడ ఒకవైపున క్రిస్టియన్ల కోసం, మరో పక్క ముస్లింల కోసం శ్మశానవాటికలను అన్ని వసతులతో నిర్మించేందుక నిధులు కేటాయించారు. పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లోని 10 గ్రామాలకు ఇదే శ్మశానవాటిక. 2022లో దీని ఆధునికీకరణ పనులను అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం రూ.1.9 కోట్లతో కొన్ని పనులు చేపట్టి వాటిని అసంపూర్తిగా విడిచిపెట్టేశారు. రెండు బర్నింగ్ యూనిట్లకు సంబంధించిన భవనాలను అసంపూర్తిగా నిర్మించారు. ఎలక్ట్రికల్ బర్నింగ్ యూనిట్, అంతిమ సంస్కారాలకు వచ్చేవారు వేచివుండేందుకు నిర్మించిన భవనాని కూడా అసంపూర్తిగానే వదిలేశారు. ఇక ముస్లిం, క్రిస్టియన్లకు కేటాయించిన స్థలంలో శ్మశానవాటికల పనులు ప్రారంభమే కాలేదు. ప్రస్తుతం శ్మశానవాటిక పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తాచెదారంతో దుర్భరంగా మారింది. దీంతో దహన సంస్కారాలకు వచ్చే వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

బోయమాంబ ఉత్సవాలు ప్రారంభం

అగనంపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీలు పినమడక, కొత్తూరు. కర్రివానిపాలెం, పూడివానిపాలెం గ్రామస్థుల ఆరాధ్య దైవం బోయమాంబ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాటాల నడుమ ఊరేగించారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

అగనంపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం చేట్టిన పీ-4 సర్వేపై సోమవారం ప్రశాంతినగర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. పీ-4 సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి విజయ్, కె.జగదీశ్, ఎం.వెంకటరరావు, ఎస్.సింహాచలం, సుబ్బరాజు, తాతారావు, నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వడ్లపూడి, కణితి, సిద్ధార్థనగర్, రాజులపాలెంలలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ డీపీఎస్ లోకేశ్, అగనంపూడి టీబీ యూనిట్ ఎస్టీఎస్ వి.అనిల్ కుమార్‌లు మాట్లాడుతూ క్షయ గాలి ద్వారా ఊపిరితిత్తులకు సంక్రమించే వ్యాధి అని, తొలి దశలోనే దీనిని గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందన్నారు. మద్యపానం, ధూమపానం, తదితర వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. ఛాతీలో నొప్పి, అలసట, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చలి జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, తదితర లక్షణాలుంటే తక్షణమే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు టి.శివయ్య, స్వరూపారాణి, ఈవో బాబీ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ జేఎస్ ఫణీంద్రకుమార్ అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో సోమవారం క్షయపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీబీని నిర్ధారించేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, దీనిని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు సొంతగనులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిలుపుదలచేయాలని కోరుతూ పారిశ్రామిక ప్రాంతంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు సోమవారం హెచ్‌పీసీఎల్‌సీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ మరడన జగ్గునాయుడు, ఇంటక్ అధ్యక్షుడు బో గవిల్లి నాగభూషణం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ స్టీల్‌ప్లాంటు పట్ల వి వక్షత చూపుతోందన్నారు. దేశంలోని అన్ని ప్లాంట్లకు సొంతగనులు కేటాయించిందని, అనకాపల్లిలో నిర్మించనున్న ప్లాంటుకు కూడా సొంతగనులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కానీ విశాఖ స్టీల్‌ప్లాంటును కాపాడుకోలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు సుమారు 960 మంది కార్మికులను తొలగించారని, వేలాది మందిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్‌టీయూసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణమూర్తి, ఏఐటీయుసీ జిల్లా నేత రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. వెంకటాపురంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ చీయాన్‌కిజంగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ వైద్య శిబిరాల ఏర్పాటుకు సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇండస్ వైద్య బృందం, ఎల్జీ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బైరీ పైడిరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2.95 లక్షల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సోమవారం అందజేశారు. పేదలకు సేవ చేయడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. అనంతరం క్రాంతినగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్పొరేటర్ గల్లా చిన్న తదితరులు పాల్గొన్నారు.

'దళిత, గిరిజనులకు న్యాయం చేయాలి'

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పథకాలను అందించినా ఉపయోగం లేదని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్ ఫైర్ అండ్ సేఫ్టీ విభాగం మొదటి అంతస్థులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన శిబిరంలో దళిత, గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరుకు రిజిస్ట్రేషన్‌లు అవుతున్నా, కాంట్రాక్టులు దక్కడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలు చేపట్టాల్సిన పారిశుధ్యం పనులను కూడా ఇతరులు చేస్తున్నారన్నారు. సమస్యలపై అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలోచంద్రమౌళి, అనార్‌బాబు, రామకృష్ణన్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా బోధన అవసరం

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేలా బోధనా పద్ధతులు అనుసరించాలని ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు సూచించారు. సెయింట్ ఆన్స్ అటానమస్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత విద్యలో విలువలకు, నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇ వ్వాలని అన్నారు. సమావేశంలో ఏయూ గణిత శాస్త్ర అధ్యాపకులు ఆచార్య నానాజీ, విజ్ఞాన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆర్.సుందర రామం, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శంభుదత్తా, హెచ్‌పీసీఎల్ మానవ వనరుల విభాగం మేనేజర్ భారతి ప్రసంగించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించి కళాశాల నివేదికను సమర్పించారు. కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అతిథులను సత్కరించారు. వివిధ విభాగాల అధిపతులు సబ్జెక్టుల నివేదికలను సమర్పించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

వేపగుంట మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 93వ వార్డులో రూ.2.69లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం కూలగొట్టడం, కక్ష సాధింపులతో కాలయాపన చేసి అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం జీవీఎంసీ నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. పెండింగ్ పనుల ప్రతిపాదనలు పంపాలని కార్పొరేటర్ రాపర్తి కన్నాకు సూచించారు. సాయిదుర్గానగర్‌లోరూ.19.20లక్షలతో సీసీ రోడ్లు, గెడ్డ రిటైనింగ్ వాల్‌కు రూ.49.37లక్షలు, ప్రహ్లాదపురంలో నూకాలమ్మ ఆలయం పక్కన చెరువు రిటైనింగ్ వాల్‌కు రూ.49.82లక్షలు, ప్రహ్లాదపురం శ్మశానవాటిక వెయింటింగ్ హాల్ నిర్మాణం, చందనపురి కాలనీ, ఎస్.డబ్ల్యూ.ఎస్ డైన్స్, ప్రహ్లాదపురం, సమతాకాలనీల్లో యుజీడీ డైన్స్ కనెక్షన్ తదితర పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కె.హైమావతి, ఈఈ చిరంజీవి, డీఈ ప్రవీణ్‌కుమార్, నేతలు నాగరాజు, పార్వతి, వరహాలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను సక్రమంగా చేపట్టాలి

పెదగంట్యాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాల్లోని కాలనీలకు తాగునీటి సరఫరాను సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నీటి వినియోగం పెరుగుతుంటే, కొళాయిల ద్వారా అందిస్తున్న నీరు తగ్గుతుందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాలైన అశోక్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వాంబే కాలనీ, బాపూజీ కాలనీ, 64వవార్డు పరిధిలోని యాతపాలెంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది.

. రోజు విడిచి రోజు ఏదో ఒక సమయంలో కొళాయిల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని, తక్కువ సామర్థ్యంతో నీటిని విడుదల చేయడం వల్ల ఎగువ ప్రాంతాలకు సరిగ్గా నీరందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. నిర్దిష్ట సమయం లేకుండా ఒకరోజు ఉదయం, ఇంకోసారి మధ్యాహ్నం, మరో రోజు రాత్రి వేళల్లో కొళాయిల నుంచి నీటిని విడుదల చేయడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోజూ ఒకే సమయానికి పూర్తి సామర్థ్యంతో నీటి సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీస్ కేసులను ఎత్తివేయాలని ర్యాలీ

ఎన్ఏడీ జంక్షన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ కార్మికులపై పెట్టిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని, ఓటీ చెల్లించాలని కోరుతూ కార్మికులు సోమవారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఓటీ సాధనకు ఈనెల 26నుంచి సత్యాగ్రహ దీక్షలకు సహకరించాలని పిలుపునిచ్చారు. రుత్తుల శ్రీనివాస్, నూకరాజు, పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుతో కార్పొరేటర్లు

'పల్లా'ను కలిసిన గాజువాక జోన్ కార్పొరేటర్లు

గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్న తరుణంలో గాజువాక జోన్ పరిధిలో ఉన్న కూటమి కార్పొరేటర్లు సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఇక్కడి పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై వారు చర్చించారు. జోన్ పరిధిలో 20 వార్డులకు గాను 14 మంది కూటమి కార్పొరేటర్లు ఉండగా, నలుగురు వైసీపీ, ఇద్దరు వామపక్షాలకు చెందిన వారున్నారు. ఇటీవల టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లతో కలిసి మేయర్‌పై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానంలో కూటమి నెగ్గి పైచేయి సాధించడం జరుగుతుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, బట్టు సూర్యకుమారి, ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, దల్లి గోవింద్, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, తదితరులు ఉన్నారు.

'సోము వీర్రాజు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘ నాయకులపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాల వల్లే ప్లాంటుకు ఈ దుస్థితి వచ్చిందని, ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తుందని పేర్కొన్నారు.

శిష్టకరణాల రాష్ట్ర సంఘ నాయకులకు సత్కారం

గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శిష్టకరణాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను సోమవారం ఇక్కడి లయన్స్‌క్లబ్‌లో సత్కరించారు. విశాఖ శిష్టకరణాల సాధికారిక సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం ప్రతినిధులు ఎ.నాగేశ్వరరావు, ఎం.గౌరీశంకర్‌లతో పాటు ఇతర ప్రతినిధులు బెహరా రాధ, బలివాడ సత్యారావులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకటరావు, తిరుపతిరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో పీ-4 పై అవగాహన

కూర్మన్నపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ధనవంతులుగా చేసే పీ-4 కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ వార్డు పరిధిలోని వడ్లపూడి సచివాలయంలో సోమవారం పీ-4 అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, ఎం.రాము, పి.దానయ్య, ఎస్.కనకరాజు, పి.కృష్ణ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి పండగకు పందిరి రాట

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరాకాలనీలోని నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంగా సోమవారం రాట వేశారు. వ్యాపార వేత్త మూగి సూర్యనారాయణ దంపతులు, దమ్ము శంకర్ పూజలు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రారంభమైన శిక్షణ

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం శిక్షణ ప్రారంభించారు. ఐసీడీసీ సీడీపీవో ఎంవీ రమణకుమారి మాట్లాడారు పోషణ్ బీ పఢాయి బీ శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. అప్పుడే పుట్టిన, మూడేళ్ల వయసు కలిగిన పిల్లలకు ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలిపారు. స్థానిక జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మూడు రోజులు జరిగే శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలుచేయాలని సూచించారు. సూపర్‌వైజర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన పండ్ల దుకాణం



గాజువాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొత్త గాజువాక పండ్ల మార్కెట్‌లో సోమవారం సాయంత్రం ఓ దుకాణం కాలిపోయింది. నాయుడు అనే వ్యక్తి తమ దుకాణంలో మధ్యాహ్నం వివిధ రకాల పండ్లు ఉంచి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో మంటలు వ్యాపించి దుకాణం మొత్తం కాలిపోయింది. సమాచారం అందుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. పక్కన ఉన్న షాపులకు మంటలు వ్యాప్తించకుండా సిబ్బంది నీటిని చల్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని నాయుడు తెలిపాడు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

అగనంపూడి, మార్చి 24 (ఆంధ్ర జ్యోతి): అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కూటమి నాయకులు నగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారులను విస్తరించాలని, ఫార్మా బస్సులను ఇష్టానుసారంగా నిలిపివేస్తుండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ఉద్యోగులు, కార్మికులు ఆయా బస్సులు ఎక్కేందుకు ప్రత్యేకంగా బస్టాప్‌లను ఏర్పాటయ్యేలా చొరవ చూపాలని కోరారు. అలాగే యువతకు పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. కలెక్టర్‌ను కలిసి వారిలో కూటమి నాయకులు పల్లా కార్తీక్, బి.సత్యనారాయణ ఉన్నారు.

'కార్మికుల పరిరక్షణకు కృషిచేయాలి'

మల్కాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణకు యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు కృషి చేయాలని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ నేత దేవర అప్పలరాజు కోరారు. కొత్తనక్కవానిపాలెంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల పక్షాన నిలబడితేనే నిజమైన నాయకుడన్నారు. కార్మిక చట్టాలను అమలుచేసే బాధ్యత ఆ శాఖ అధికారులదేనన్నారు, సమావేశంలో ఆడారి లక్ష్మీనారాయణ, లోకేష్‌బాబు, ముసిలినాయుడు, ఉరుకూటి శ్రీనివాసరావు, బుద్ధి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు రేపు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 26న సాలిగ్రామపురం హాకీ మైదానంలో నిర్వహిస్తామని హాకీ సంఘం కార్యదర్శి కె.వి.ఆంజనేయరావు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి ఒకటి, 2006న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు మధ్యాహ్నం 3.45 గంటలకు సాలిగ్రామపురం హాకీ మైదానంలో వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఏప్రిల్ 6 నుంచి ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీలో విశాఖ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

జాగ్రత్తలతో క్షయ దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

అల్లిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని దూరం చేసుకోవచ్చని ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సోమవారం అల్లిపురం భీమ్‌నగర్ అర్బన్ ప్రజారోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధికి కారణాలు, చికిత్స సిబ్బంది అందించే సేవలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమలో డాక్టర్ నిఖిల్, డీపీసీ శ్రీనివాసరావు, రవికిరణ్, గోపీనాథ్, రత్నం, జానకి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

28న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా 28న ఉదయం 6 గంటల నుంచి సమ్మె చేపట్టనున్నామని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. సోమవారం రాత్రి టౌన్‌షిప్‌లో జరిగిన సమావేశంలో నాయకులు ఈమేరకు తీర్మానం చేశారు. ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడ్ని తొలగించరాదని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేయనున్నామని చెప్పారు. 26న ఆర్‌ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిగే క్రమంలో ఆర్‌ఎల్‌సీ కార్యాలయం వద్ద నిరసన చేస్తామన్నారు.

ఉద్యమ్ ఉచిత రిజిస్ట్రేషన్లు నేడు

అల్లిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారానికి జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయం వద్ద ఉచితంగా ఉద్యమ్ (ఎంఎస్ఎంఈ) రిజిస్ట్రేషన్లు చేయనున్నారని, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు కోరారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందన్నారు.

పేదల అభ్యున్నతికి పి-4

మురళీనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం పి-4 ద్వారా బలహీనవర్గాలకు నేరుగా లబ్ధి చేకూరుతుందని 51వ వార్డు టీడీపీ అధ్యక్షురాలు సనపల కీర్తి అన్నారు. ఇది విప్లవాత్మక సంస్కరణగా నిలుస్తుందన్నారు. సచివాలయాల వారీగా 20 శాతం పేదలను గుర్తించి జాబితా రూపొందించారన్నారు. సోమవారం 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన గ్రామసభలో కీర్తి మాట్లాడారు. ప్రజలనుంచి సూచనలు స్వీకరించారు. యూసీడీ విభాగం సీవో, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, టీడీపీ నాయకులు హాజరయ్యారు.

పర్యాటక మంత్రిని కలిసిన జనసేన పార్టీ నాయకులు



విమానాశ్రయంలో మంత్రి దుర్గేష్‌తో పశుపులేటి ఉషాకిరణ్ ఇతర నాయకులు

మర్రిపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బ్లూఫాగ్ జెండా ఆవిష్కరణ నిమిత్తం నగరానికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు ఆమె తెలిపారు. మంత్రిని కలిసినవారిలో 44, 53 వార్డుల జనసేన అధ్యక్షులు పడాల పరమేశ్వరరావు, నీరుకొండ దివాకర్ ఉన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

డాబాగార్డెన్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కంటి సంరక్షణ ఎంతో ముఖ్యమని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ పాఠశాలలో విశాఖ ఐ హాస్పిటల్ సహకారంతో 45 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేసి జాగ్రత్తలు చెప్పారు. కె.విమలకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

27 నుంచి కళాభారతిలో జాతీయ నాటకోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27, 28, 29 తేదీల్లో మద్దిలపాలెం పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రైటర్స్ ఆకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాటకోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రమణమూర్తి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు అంతర్జాతీయ స్థాయిలో పేరొచ్చేలా లీడర్ విశాఖలో జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నటు తెలిపారు. ఈ నెల 27న గుజరాత్‌కు చెందిన రచయిత అర్పిల్ దాగత్ దర్శకత్వంలో 'ఐటెం' నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 28న అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన రికెస్ దర్శకత్వం వహించిన 'ద సెల్ ఆఫ్ లైఫ్', 29న కేరళకు చెందిన హిస్సం టోంటో దర్శకత్వం వహించిన 'ద టైగర్ మ్యాన్' నాటకాన్ని ప్రదర్శిస్తారన్నారు. మొదటి రోజు ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ముగింపు కార్యక్రమంలో టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోంమంత్రి వంగలపూడి అనిత, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. నాటకాలు తిలకించడానికి వచ్చేవారు ఉచిత పాస్‌ల కోసం నాంచారయ్య 98494 14758, మేడ మస్తాన్‌రెడ్డి 96760 40165, ఫణి స్వామి 86394 45706 ఫోను నెంబర్లకు సంప్రదించాలన్నారు. సమావేశంలో విశ్రాంత ఏయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ కె.వి.ఎల్.డి.ప్రసాద్, రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ వేమలి త్రినాథరావు, చలసాని కృష్ణప్రసాద్, రాధా రాణి, చిన సూర్యారావు, సన్ మూర్తి, డి.ఆర్.కిరణ్, నాగేశ్వరరావు, నాటక అభిమానులు పాల్గొన్నారు..

పవర్ లిఫ్టింగ్ టోర్నీలో పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. నగరంలోని విజయాంధ్ర వ్యాయామ మండలిలో జరిగిన ఈ టోర్నీలో పురుషుల విభాగంలో సీహెచ్.లోకేష్ స్వర్ణ, కాంస్య పతకాలు, పి.భార్గవ్ స్వర్ణ పతకం, ఎ.మోహన్ వెంకట్ స్వర్ణ పతకం, ఎ.వరప్రసాద్, రేవంతరెడ్డి రజత పతకాలు సాధించారు. మహిళల విభాగంలో ఎండి.వసీం స్వర్ణ, రజత పతకాలు, జి.రాఘవ అనూష స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తన చాంబర్ వద్ద పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేయొద్దు

సీతంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించకూడదని, క్రమశిక్షణతో సన్మార్గంలో నడుచుకోవాలని ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి వి.గంగాభవాని సూచించారు. బీవీకే కళాశాల్లో విద్యార్థులకు పోక్సో చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన వి.గంగాభవాని మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. నేటి యువత మొబైల్ ఫోనుకు ఎక్కువగా ఆకర్షితులై అనవసర విషయాలపై ఆసక్తి చూపడం తగదన్నారు. తప్పుడు పనులు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని, వాటి బారిన పడకుండా సన్మార్గంలో నడుచుకోవాలని హితవు పలికారు. న్యాయమూర్తిని నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ద్వారకా పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ రత్నశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో, అధ్యాపకులు పాల్గొన్నారు.

అదరగొట్టిన అశుతోష్

... 5వ పేజీ తరువాయి

తరువాత క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రిషబ్‌పంత్ ఆరు బంతులు ఆడి పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. పూరన్ కేవలం 30 బంతుల్లో ఆరు బౌండరీలు, ఏడు సిక్సర్లతో 75 పరుగులు చేసి స్టార్క్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ మోహిత్ బౌలింగ్‌లో చివరి రెండు బంతులను మిల్లర్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టడంతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 209 పరుగులు చేసింది. 210 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా వికెట్లు కోల్పోవడంతో గ్యాలరీలలోని ప్రేక్షకులలో ఉత్సాహం తగ్గింది. డుప్లెసిస్ (29), కెప్టెన్ అక్షర పటేల్ (22), స్టబ్స్ (34) కొద్దిసేపు మెరిశారు. స్టబ్స్ అవుట్‌తో మ్యాచ్ ఢిల్లీ చేజారిందని అందరూ భావించారు. ఆ సమయంలో అశుతోష్‌శర్మ అజేయ అర్ధ సెంచరీ (66 నాటౌట్), విప్‌రాజ్ నిగమ్ (39) మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు.

విద్యార్థినికి గవర్నర్ ప్రశంస



కుశాంకకు ప్రశంసాపత్రం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

జ్ఞానాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న జి.కుశాంకకు ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసాపత్రం అందజేశారని ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులకు అమరావతిలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ బృందంలో తమ కళాశాల విద్యార్థిని ఉండడం ఆనందదాయకమన్నారు. కుశాంక చదువులో రాణిస్తూనే, ఎన్ఎస్ఎస్ ద్వారా అనేక సమాజ సేవ, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొందన్నారు. గణతంత్ర కవాతు (మార్చ్‌పాస్ట్)లో ఆమె అసాధారణ నైపుణ్యం, ప్రతిభ కనబరిచిందన్నారు. జాతీయ స్థాయిలో తాను రాణించేందుకు సహకరించిన ప్రోగ్రాం అధికారి కె.మాణిక్య కుమారి, ఏయూ అధికారులకు కుశాంక కృతజ్ఞతలు తెలిపింది.

కారుపై కూలిన చెట్టు



అక్కయ్యపాలెం ప్రధాన రహదారిపై కూలిపోయిన చెట్టు

అక్కయ్యపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రదాన రహదారి నుంచి జగ్గారావు వంతెన వైపు వెళ్లే రహదారి పక్కన ఓ చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. అక్కడున్న ఒక కారు, ద్విచక్రవాహనంపై చెట్టు పడిపోవడంతో ఆ వాహనాలు ధ్వంసమయ్యాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఏం జరిగిందోనని స్థానికులు ఉలిక్కిపడ్డారు. అదృష్టవశాత్తూ ఆ వాహనాల్లోనూ, చెట్టు కూలిన ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఉద్యానవన శాఖ సిబ్బంది చెట్టును తొలగించి బాటసారులకు ఇబ్బందులు లేకుండా చేశారు.

బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి: సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో ఇతర ప్రతినిధులు

సీతమ్మధార, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సీతమ్మధారలోని పాపాహోమ్‌లో గ్లోబల్ పింక్ ఆర్మీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళా సాధికారత, యోగ, మహిళల అనారోగ్య సమస్యలు, ఇతర విషయాలపై శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. ఆరోగ్యాన్ని కోల్పోతే జీవించలేమని, అనారోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ పింక్ ఆర్మీ సేవా సంస్థ అధ్యక్షురాలు కొత్తపల్లి జ్యోతి, యోగా గురువు డాక్టర్ రేణుక, డాక్టర్ దేవిశ్రీ, పాపా హోమ్ అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి రమేష్ చంద్ జైన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలో ఎక్కువగా తిరగొద్దు



సూచనలు చేస్తున్న జేసీఎల్ రామారావు

అక్కయ్యపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ రామారావు సూచించారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, నాయకులు, యజమానులతో సోమవారం సాయంత్రం సమావేశమై వడగాడ్పులపై సూచనలు చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో వడగాడ్పులు వీస్తున్నాయని, ప్రతి ఒక్కరూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రాకుండా ఇంటిలోనే ఉండాలన్నారు. నీడలోనే పనులు చేసుకోవాలని సూచించారు. తలకు టోపి, పాదరక్షలు వేసుకోవాలని చెప్పారు. ఎక్కువగా నీరు తాగాలని తెలిపారు. మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలని పేర్కొన్నారు. తెల్లరంగు నూలు దుస్తులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎల్ ఎం.సునీత, ఏఎల్ఓ విజయ్‌కుమార్, కార్మికశాఖాధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కంచరపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితులను విచారించిన ఐదో ప్రత్యేక స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ దాశరథి పేర్కొన్నారు. మద్యం తాగి ఆటో నడిపిన రాంజీ ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ఎస్.చిన్నకు 12 రోజులు జైలు శిక్ష విధించారని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనచోదకులు 17 మందికి రూ.10 వేల నుంచి రూ.20 వేలు జరిమానా విధించారన్నారు.

అల్లూరిపై సినిమా: దర్శకుడు కృష్ణవంశీ



కృష్ణాదేవిపేటలో అల్లూరి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దర్శకుడు కృష్ణవంశీ, రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తదితరులు

కృష్ణాదేవిపేట (అనకాపల్లి జిల్లా), కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి చరిత్రకు సంబంధించిన మరిన్ని అంశాలతో సినిమా తీయాలనే ఆలోచన ఉన్నట్టు దర్శకుడు కృష్ణవంశీ తెలిపారు. ఆయన సోమవారం ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌తో కలిసి అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల అల్లూరి స్మారక పార్కును సందర్శించారు. అల్లూరి, గంటందొరల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రకు సంబంధించి పార్కులో ఉన్న శిలాఫలకాలను పరిశీలించారు. అక్కడ నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బట్టపణుకుల పంచాయతీ లంకవీధి వెళ్లి అల్లూరి అనుచరులైన గాం గంటం దొర, మల్లుదొర వారసులను పరామర్శించారు. వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. గంటందొర జీవిత విషయాల గురించి ఆరా తీశారు. 'నేను సైతం' ఛారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ కె.శివప్రసాద్ సమకూర్చిన చీరలు, దుప్పట్లను గంటందొర కుటుంబీకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ అల్లూరిపై కొత్తపంథాలో సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. గంటందొర, మల్లుదొరలకు చెందిన జీవిత విశేషాలను, స్వాతంత్ర్యం సాధించడంతో వారి పాత్రను భావితరాలకు తెలిసేలా సినిమాకు రూపకల్పన చేస్తామన్నారు. అల్లూరి చరిత్రపై 20 సంవత్సరాలు పైబడి రీసెర్చ్ చేసిన గోకరాజు నారాయణరావు రచనను ఆధారంగా చేసుకుని సినిమా తీయాలనుకుంటున్నట్టు చెప్పారు. అల్లూరి అంటే రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక అభిమానం ఉన్నందున ఆయన ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ అల్లూరి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్మారక ప్రాంతాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు.

ఏప్రిల్ 7 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఏప్రిల్ 7 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు జరగనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఏప్రిల్ 7-17 మధ్య, 9-15 తేదీల మధ్య ప్రాథమిక తరగతులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తొమ్మిదో తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రశ్నపత్రాలను జిల్లా కామన్ పరీక్షల బోర్డు నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తారు. పరీక్షల అనంతరం జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించడం, తరువాత విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్‌చేసే ప్రక్రియ ఏప్రిల్ 23లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించారు.

గెడ్డలో వ్యర్థాల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

పరిష్కరించాలని కార్యక్రమానికి హాజరైన స్థానిక కార్పొరేటర్ బొండా జగన్, ఇతర అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ జగన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఏఎంఓహెచ్ కిరణ్‌కుమార్ చొరవతో సోమవారం ఎస్కవేటర్‌తో గెడ్డలో వ్యర్థాలను తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో తమ సమస్య పరిష్కారమైందనీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సూపర్ బజార్ ఎండీ సరండర్

... 5వ పేజీ తరువాయి

డిపాజిట్లు కూడా క్రమంగా తగ్గిపోయాయని ఆరోపించారు. ఆడిట్ అధికారులు కూడా సహకరిస్తున్నా రని పేర్కొన్నారు. వీటన్నింటిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జిల్లా సహకార శాఖాధికారిణి ప్రవీణ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. దాంతో సూపర్ బజారు ఎండీ పోస్టు నుంచి శ్రీనివాసరాజును తప్పించి కమిషనరేట్‌కు సరండర్ చేశారు. ప్రవీణే కొంతకాలం ఎండీగా అదనపు బాధ్యతలుగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎండీ అక్రమాలకు సహకరించిన అడిటర్లపై చర్యలు ఏమీ చేపట్టరా?, వారు నిర్వహించిన ఆడిట్ లోపాలు బయట పెట్టరా? అని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. సహకార శాఖ చాలా వరకూ లోపాలమయం కావడంతో ఒకరి జాతకం బయటపెడితే మరొకరికి ఇబ్బంది వస్తుందని, ఒకరికి మరొకరు సహకరించుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సూపర్ బజార్ అక్రమాలపై లోతైన విచారణ చేసి బాధ్యులందరిపై చర్యలు చేపట్టాల్సి ఉంది.

పాఠశాలలకు షాక్

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాఠశాలల నిర్వహణకు సక్రమంగా నిధులు మంజూరు చేయలేదు. దాంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. నెలకు ప్రాథమిక పాఠశాలకు రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.ఐదు వేల నుంచి రూ.15 వేలు బిల్లులు వస్తున్నాయి. ఒకపక్క నిర్వహణ గ్రాంటు ఇవ్వకపోవడం, మరోవైపు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ప్రధానోపాధ్యాయులు సమస్యను గత ప్రభుత్వంలో విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి సమస్య తీసుకువెళ్లారు. పాఠశాలలు విద్యుత్ బిల్లులు చెల్లించనక్కర్లేదని ఆయన చెప్పడంతో గండం గట్టెక్కిందని హెచ్‌ఎంలు ఊపిరిపీల్చుకున్నారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా పాఠశాలల విద్యుత్ బిల్లులపై చర్చ వచ్చినప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పింది. అంతేకాకుండా పాఠశాలల నిర్వహణకు గత ఏడాది, తాజాగా నిధులు విడుదల చేసింది. అయితే ఆ నిధులు పాఠశాలల నిర్వహణకు మాత్రమే సరిపోతాయని టీచర్లు చెబుతున్నారు. ఇదిలావుండగా విద్యుత్ బకాయిలు చెల్లించాలని రెండు, మూడు రోజుల నుంచి పాఠశాలలకు నోటీసులు రావడంతో అంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పాఠశాల స్థాయి బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు బకాయి నోటీసులు అందాయి. సింహాచలం బీసీ గురుకుల పాఠశాలకు రూ.5.5 లక్షల డిమాండ్ నోటీస్ అందింది. విద్యుత్ బకాయిలు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలను హెచ్‌ఎంలు కోరుతున్నారు.

క్యాంపు రాజకీయాలు

... 5వ పేజీ తరువాయి

చేయాలనేది తేదీని నిర్ణయిస్తారు. సమావేశం నిర్వహించాలనుకున్న రోజుకు కనీసం 15 రోజులు ముందు కార్పొరేటర్లకు సమాచారం అందజేయాల్సి ఉంటుంది. దీనినిబట్టి అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం జరగాలంటే కనీసం మరో 20 రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను క్యాంపునకు తరలించడం చర్చనీయాంశంగా మారింది. అవిశ్వాసతీర్మానంపై సమావేశం మరో 20 రోజుల వరకు జరిగే అవకాశం లేదు. అంతేకాకుండా ఈనెల 29న బడ్జెట్ సమావేశం ఉన్నందున కార్పొరేటర్లంతా ఆ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఇప్పటి నుంచే కార్పొరేటర్లను బెంగళూరు క్యాంపునకు తరలించడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆ పార్టీ నేతలు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను కూటమి వైపు ఆకర్షితులు కాకుండా ముందు జాగ్రత్తగా బెంగళూరు క్యాంపునకు రూపకల్పన చేశారు. వైసీపీకి 59 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ వారిలో సుమారు 30 మంది ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరిపోయారు. మిగిలిన 29 మందిలో సోమవారం 28 మంది బెంగళూరు వెళ్లినట్టు సమాచారం. మూడు విడతల్లో విశాఖ నుంచి విమానంలో బెంగళూరు తరలించారు. కార్పొరేటర్లతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా క్యాంపునకు వెళ్లడం విశేషం. ఇదిలావుండగా వైసీపీ కార్పొరేటర్లు పార్టీని వీడకుండా ఉండేందుకు భారీగా నజరానా ఇస్తామని ఆశ చూపినట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వైసీపీని వీడి కొన్నాళ్ల కిందట కూటమి పార్టీల్లో చేరిన వారిని తిరిగి వెనక్కి రప్పించుకునేందుకు నేతలు వ్యూహరచన చేస్తున్నారు. అందులోభాగంగా ముగ్గురు కార్పొరేటర్లతో సంప్రతింపులు జరుపుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో తమ కార్పొరేటర్లను కూడా బడ్జెట్ సమావేశం తరువాత ఎక్కడికైనా తరలిస్తేనే బాగుంటుందని కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు.

రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్

... 5వ పేజీ తరువాయి

మూడు వారాల్లో బీచ్‌లో మౌలిక వసతులు మెరుగుపరిచిందన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. పార్కింగ్‌కు కూడా అదనపు స్థలం కేటాయించామన్నారు. ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి మాట్లాడుతూ, త్వరలో బీచ్ నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించినా ఎవరు వస్తున్నారు?, ఎలా వస్తున్నారు? తదితర విషయాలను సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షించడానికి టెక్నాలజీ ఉపయోగించుకుంటామన్నారు. సాగర్‌నగర్ బీచ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి గంటా రవితేజ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏపీటీడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్‌డీ జగదీశ్, జిల్లా పర్యాటక శాఖాధికారి సుధాసాగర్, జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్, తదితరులు పాల్గొన్నారు. బీచ్‌లో పర్యాటకులను కాపాడే వారికి రక్షణ పరికరాలు అందించారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

... 5వ పేజీ తరువాయి

చేసి తన ఆధీనంలో ఉంచుకున్నారు. మరికొంత భూమిని రైతులు సాగు చేస్తూ జీడి, మామిడి తోటలు పెంచుకున్నారు. అయితే పూసపాటి వంశీయుల నుంచి దఖలు పడినట్టు కొందరు డాక్యుమెంట్లు సృష్టించి భూముల స్వాధీనానికి యత్నించడం, రైతులు ప్రతిఘటించడం, తదితర కారణాలతో గ్రామాన్ని అన్‌సెటిల్‌గా రెవెన్యూ శాఖ గుర్తించింది. గ్రామంలోని సర్వే నంబరు 2 నుంచి 36 వరకు మొత్తం 125 ఎకరాలను 2017లో జిల్లా యంత్రాంగం ప్రభుత్వ నిషేధ భూముల జాబితా (22-ఎ)లో చేర్చింది. ఈ మేరకు ఆనందపురం తహసీల్దార్ ఒక సర్క్యులర్ జారీచేశారు. అలాగే సర్వేనంబర్ 13లో 87.6 ఎకరాల బంజరు ఉండగా, అందులో సుమారు 41.89 ఎకరాలకు గ్రామంలో భూమి లేని పేదలకు చాలాకాలం క్రితమే ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇంకా 45.71 ఎకరాల భూమి బంజరుగా ఉంది. కొందరు రైతులు ఈ భూమిలో జీడి, మామిడి తోటలు పెంచుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదిలావుండగా నగరానికి ఆనుకుని ఉన్న ఆనందపురం మండలంలో భూములకు విలువ పెరగడంతో అదే ప్రాంతానికి చెందిన ఒకరు రంగంలోకి దిగి 22-ఎలో ప్రభుత్వ బంజరుగా ఉన్న 45.71 ఎకరాలు, పేదలకు పట్టాలు ఇచ్చిన భూమి సుమారు 41.89 ఎకరాలు మొత్తం..87.6 ఎకరాలు విజయనగరం సంస్థానం నుంచి తమకు దఖలు పడిందని పేర్కొంటూ, వాటిని విక్రయించేందుకు కొద్దికాలంగా అడ్వాన్స్‌లు తీసుకున్నారు. అడ్వాన్స్‌లు ఇచ్చిన పలువురు ఆ తరువాత ఆనందపురం మండల తహసీల్దారు కార్యాలయం అధికారులను సంప్రతించగా అసలు విషయం తెలిసింది. ముచ్చెర్ల గ్రామంలో సర్వే నంబర్ 13లో మొత్తం బంజరుగా ఉందని, గతంలో 40 ఎకరాలకుపైగా పేదలకు పట్టాలు ఇచ్చామని వివరించారు. అయినా తాజాగా సదరు దళారి మరికొందరిని మోసంచేసి అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు గుర్తించిన కొందరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా ముచ్చెర్ల అన్ సెటిల్ గ్రామం అని పేర్కొన్నారు. అటువంటప్పుడు భూములు కొనుగోలు చేసేవారంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వే నంబర్ 13లో ఉన్న 45.71 ఎకరాలను 2017లో 22-ఎలో చేర్చామని, అది ప్రభుత్వ బంజరు అని స్పష్టంచేశారు.

వైభవంగా అభయ గణపతి కల్యాణోత్సవం



ఆరిలోవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 12వ వార్డు సాలిపేటలో అభయ గణపతి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయం ఆరో వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ కల్యాణ ఉత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వేద పండితులు మంథా ఈశ్వర ప్రసాద్ పూజలు జరిపించారు.తొలుత లక్ష్మీ గణపతి హోమం చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

టెన్త్ పరీక్ష రాసిన 'వండర్ కిడ్స్'



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ అసాధారణ ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్టేట్ బోర్డు టెన్త్ ఇంగ్లీష్ పరీక్ష రాసి అబ్బురపరిచారు. స్కూల్లో సోమవారం నిర్వహించిన ఈ పరీక్షలో 5, 6, 7 తరగతులు చదువుతున్న 182 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథుల సమక్షంలో తెలంగాణ నిర్వహించిన టెన్త్‌క్లాస్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశ్నపత్రాలకు జవాబులు రాసి ఆశ్చర్యపరిచారు.

బీఈడీ పరీక్షల పర్యవేక్షణ

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏయూ విద్యా విభాగంలో సోమవారం నిర్వహించిన బీఈడీ పరీక్షలను పీజీ ఎగ్జామ్స్ ప్రొఫెషనల్ కోర్సుల డీన్ ఆచార్య కేశవరావు పర్యవేక్షించారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. వారి వసతులకు సంబంధించిన విషయాలపై విభాగాధిపతి డాక్టర్ టి.షారోనురాజును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్న విషయాన్ని కేశవరావు గమనించి సంతోషం వ్యక్తం చేశారు.

నూకాంబిక అమ్మవారి జాతరకు ఏర్పాట్లు

ఆరిలోవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాత డెయిరీఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర మంగళవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొత్త అమావస్య రోజున అమ్మవారికి విశేష పూజలు చేసి, అత్యంత వైభవంగా జాతర నిర్వహిస్తామన్నారు. కోలాటం, గరిడితో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్షయ పట్ల అప్రమత్తం

ఆరిలోవ,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో ఆరిలోవ టిబి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం క్షయ నిర్మూలన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సెంట్రల్ జైలు వైద్యుడు ఆర్‌వీఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్షయపట్ల అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే వ్యాధి నిర్మూలన సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డీపీఎస్ లోకేష్, సీనియర్ టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ వేములయ్య, స్టాఫ్ నర్స్ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
● **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలీ 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176



ఆర్కే బీచ్‌లో కలుస్తున్న మురుగు నీరు



సముద్రంలో జలచరాల మృతికి కారణమవుతున్న కలుషిత నీరు

తీరం..కలుషితం

» బీచ్‌లో భారీగా కలుస్తున్న వ్యర్థాలు
» మృత్యువాత పడుతున్న జలచరాలు
» పట్టించుకోని అధికారులు

బీచ్ రోడ్డు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందే సముద్ర తీరంలో మురుగు నీరు చేరి కలుషితమవుతున్నా జి.వి.ఎం.సి. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కలుషిత నీటితో తీరానికి నష్టం వాటిల్లుతూ, ప్రజల ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో ఆలోచించాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర అని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో జిల్లాలో ప్రతి నెలా పలుచోట్ల చెత్త తొలగించే పనులు సాగుతున్నాయి. అయితే ఆర్కే. బీచ్ సాగర తీరంలో పేరుకుపోయిన చెత్త, కలుషితమవుతున్న తీరాన్ని గాలికొదిలేశారు. మురుగునీటి కాలువల ద్వారా వ్యర్థాలెన్నో ప్రతిరోజు సముద్రంలో కలుస్తున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు సముద్ర జలాల్లో కలిసి మళ్లీ ఒడ్డుకు కొట్టుకు వస్తున్నాయి. సందర్శకులు తమతో తీసుకొచ్చిన తిను బండారాలు, సంచులను బీచ్ వద్ద పారవేస్తున్నారు. దీంతో అందమైన తీరం అపరిశుభ్రంతో నిండిపోతోంది. నగరం నుంచి వచ్చే మురుగునీరు సముద్రంలో కలిసిపోవడంతో సముద్ర జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయి. సముద్ర జలాల్లోని మత్స్య సంపద నాశనమవుతోంది. సముద్రంలో ప్రమాదకర రసాయనాలు కలవడంతో ప్రజలకు, జీవరాశులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పలువురు వాపోతున్నారు. కలుషితమైన సముద్రంలో తాబేళ్లు, జీవరాశులు చనిపోతున్నాయి. సముద్రంలో నివసిస్తున్న జీవరాశులకు ఆక్సిజన్ అందక మృతి చెందుతున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రకృతి రమణీయతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరిస్తే తీరానికి వచ్చే సందర్శకులు కాస్త ఉపశమనం పొందుతారు.



మాట్లాడుతున్న న్యాయాధికారిణి హనీజ

ఆడ పిల్లలను చదివించండి

ఆరిలోవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 13వ వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, బడి ఈడు పిల్లలు పాఠశాలల బయట ఉండే పరిస్థితి నివారణపై సోమవారం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా శిశు సంక్షేమ శాఖ న్యాయాధికారిణి హనీజ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని, ఆడపిల్లలను చదివించి వారిని ఉన్నత మార్గంలో తీసుకెళ్లాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు.చదువు తరగని ఆస్తి అని, దానిని ఎవరూ దొంగిలించలేరని అన్నారు.విద్యావంతులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్పొరేటర్ కెల్ల సునీత, వార్డు కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ కృషితో ఉత్తరాంధ్రలో జార్జియా నేషనల్ వర్సిటీ

సిరిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు రూ.1300 కోట్ల పెట్టుబడితో ఉత్తరాంధ్రలో జార్జియా నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు లోకేశ్ నేతృత్వంలో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ విద్యా కేంద్రంగా మార్చాలని మంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇసుకతోట (16వ వార్డు) శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ప్రసాది అప్పారావు, పల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఒమ్మి గోపికృష్ణ (నాయుడు), సహాయ కార్యదర్శులుగా మువ్వల శ్రీను, ముగడ శేఖర్, కోశాధికారిగా గొలగాని రాజు, సహాయ కోశాధికారిగా గొలగాని శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఒమ్మి గోపినాథ్, కాకర రాములను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. వీరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు.

భీమిలి - దొరతోట 200 అడుగుల రోడ్డును వ్యతిరేకిస్తూ నిరసన

సిరిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఇటీవల భీమిలి నుంచి దొరతోట వై జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 200 అడుగులుగా మారుస్తూ ప్రతిపాదన చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సోమవారం వీఎంఆర్డీఏ కార్యాలయం ఎదుట బాధిత గ్రామస్తులు, గృహ యజమానులు, ప్లాట్ ఓనర్లు, దుకాణదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ గంగారామ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రోడ్డు విస్తరణ ప్రతిపాదనను ఉపసంహరించాలని కోరారు. కేవలం రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే రోడ్ల విస్తరణ చేపట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు అప్పలనాయుడు, సూర్యనారాయణ, బోడపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి'

సిరిపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి గత ప్రభుత్వ వైఫల్యాలు ఎంత ఉపయోగపడ్డాయో, అంతకన్నా ఎక్కువగా సూపర్‌సిక్స్ పథకాల హామీలు ప్రజలను ఆకర్షించాయన్నారు. అయితే ఈ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కె.చిన్నారావు, రాజేంద్రప్రసాద్, నూకరాజు, సూరప్పడు మాట్లాడారు. అరుణోదయ కళాకారులు సూపర్‌సిక్స్ బండారాన్ని బయటపెట్టే పాటలను, మద్యం అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ పోరాట సందేశాన్ని ఇచ్చే పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణిదేవి, కార్యదర్శి ఇందిర, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు ఈసరలక్ష్మి, రూప, గీత, జయమ్మ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి

నీటి సంరక్షణ..భవిష్యత్తు తరాలకు సంపద



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నీటిని సంరక్షిస్తే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యం, అభివృద్ధి అని విశాఖ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు జీవీఎంసీ సమావేశ మందిరంలో సోమవారం 'గ్లేసియర్ ప్రిజర్వేషన్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటశేషమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటి సంరక్షణ చర్యల ప్రాముఖ్యతను చెప్పారు. వర్షపు నీటి సేకరణ, సమర్థవంతమైన నీటిపారుదల, మురుగునీటి శుద్ధి, నీటి వనరులను సమర్థంగా ఉపయోగించడం, రక్షించే వివిధ వ్యూహాలను వివరించారు. జల వనరులలోకి మురుగు నీటిని విడుదల చేసే ముందు శుద్ధి చేయాలని ఆమె సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు, అశ్లీలత నుంచి వారిని రక్షించడానికి పోక్సో చట్టం ఎంతగా ఉపకరిస్తుందో తెలియజేశారు. ఏయూ ప్రొఫెసర్ ఇ.యు.బి.రెడ్డి, ప్రొఫెసర్ వి.వెంకటేశ్వరరావు, ప్రఖ్యాత పర్యావరణ నిపుణులు, జీవీఎంసీ, ఏపీపీసీబీ అధికారులు పాల్గొని స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులను అవలంబించాలని కోరారు.

జీవీఎంసీకి 71 వినతులు

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 71 వినతులు వచ్చాయని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఏడీసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

ఫిర్యాదులను పరిష్కరించాలి

సిరిపురం : వీఎంఆర్డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినతులు గడువులోగా పరిష్కరించాలన్నారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగకుండా బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శి మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై వినతి

పెదవాల్తేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రైల్వే నూతన డీఆర్ఎం లలిత్ బొహ్రను రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే జోన్ భవన నిర్మాణంపై వాకబు చేశారు.తాను గతంలో విశాఖ నుంచి కాశీకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ... ప్రస్తుతం విశాఖ నుంచి గయా వెళుతున్న రైలును రెగ్యులర్ చేయాలని కోరారు. అలాగే విశాఖ నుంచి జోద్పూర్‌కు రెగ్యులర్ రైలు వేయడంతో పాటు నిజాముద్దీన్ వరకు ప్రయాణిస్తున్న సమతా ఎక్స్‌ప్రెస్‌ను హరియాణాలోని హిస్సార్ వరకు పొడిగించాలన్నారు.

'విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న జిజ్ఞాస అవసరం'

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్సుకత కనబరిస్తే ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగాచార్యులు ఎం.లక్ష్మీనారాయణరావు అన్నారు. సోమవారం ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో ఆయన ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి స్మారక ఉపన్యాసమిచ్చారు. ముందుగా శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆచార్య లక్ష్మీనారాయణ ప్రసంగించారు. మానవ జీవితం, ప్రకృతి అంతా రసాయన శాస్త్ర సమ్మేళనమని సోదాహరణంగా వివరించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆచార్య వెంకటేశ్వర్లు, తదితరులు

గ్రంథాలయాల డిజిటలీకరణతో సేవలు సులభం

ఏయూ చీఫ్ లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు

మద్దిలపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను డిజిటలీకరిస్తే అధ్యాపకులు, విద్యార్థులకు సులభంగా సేవలందించవచ్చని ఏయూ ముఖ్య గ్రంథపాలకుడు (చీఫ్ లైబ్రేరియన్) ఆచార్య పి.వెంకటేశ్వర్లు చెప్పారు.డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గ్రంథాలయాధికారులకు అయిదు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాల్లో సోల్ సాఫ్ట్‌వేర్ వినియోగం కీలకమన్నారు. ఇది విశ్వవిద్యాలయాలు, కళాశాలల లైబ్రరీల్లో ఉపయోగించే మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ అని, దీన్నే ఇన్‌ఫ్లిబ్‌నెట్ సెంటర్‌గా రూపొందించారని తెలిపారు. గుజరాత్‌కు చెందిన ఇన్‌ఫ్లిబ్‌నెట్ సెంటర్ శాస్త్రవేత్త హేమచోలీస్ మాట్లాడుతూ సోల్ సాఫ్ట్‌వేర్‌లో అక్విజిషన్, కేటలాగ్, సిరిక్యులేషన్, సీరియల్ కంట్రోల్, ఓపీఏసీ, అడ్మినిస్ట్రేషన్ ఫీచర్లు ఉంటాయని తెలిపారు. ఆయా ఫీచర్ల గురించి లైబ్రేరియన్లకు వివరించారు.

ఈ కార్యక్రమంలో కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, గ్రంథాలయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు అంధకారం

జూనియర్ కోర్టు న్యాయమూర్తి కార్తీక్



మాట్లాడుతున్న మూడో అదనపు జూనియర్ కోర్టు న్యాయమూర్తి కార్తీక్

పెదవాల్తేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బాలలు నేరపూరితమైన వ్యవహారాల్లోచిక్కుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని మూడో అదనపు జూనియర్ కోర్ట్ న్యాయమూర్తి జి. కార్తీక్ పేర్కొన్నారు. పోక్సో చట్టం, అందులోని అనేక అంశాలపై సోమవారం ఈస్టు పాయింట్ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ కోర్ట్ న్యాయమూర్తి కార్తీక్ మాట్లాడుతూ క్రిమినల్ కేసులు ఉంటే ఏ స్థాయిలోనూ ఎదిగే అవకాశం లేదని హెచ్చరించారు. ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు పొందే విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వివాహ వయస్సు ముందు కౌమారదశలో ఉండే విద్యార్థులు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షలు తప్పవన్నారు. చదువుపై దృష్టి పెట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు.మంచి, చెడు స్పర్శ (గుడ్, బ్యాడ్ టచ్)ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్థమైన వయస్సు లేకుండా ఏ రకంగా వివాహం చేసుకున్నా నేరంగానే చూస్తామన్నారు. అనంతరం మూడో పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్ సంతోష్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, తల్లిదండ్రులను గౌరవించడం అవసరమన్నారు. లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయడంతో పాటు అసాంఘిక శక్తులకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. మధురవాణి, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయం విద్యార్థులకు మ్యాచ్ వీక్షించే అవకాశం



మ్యాచ్ చూస్తున్న విద్యార్థులు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు 30 మంది అనాథ శరణాలయం చిన్నారులకు అవకాశం కలిగింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సొంత నిధులతో టికెట్లు కొనుగోలు చేసి వైజాగ్‌లోని పాపా హోం అనాథ శరణాలయానికి అందజేయడంతో విద్యార్థులు ఢిల్లీ క్యాపిటల్స్-సూపర్‌జెయింట్ క్రికెట్ మ్యాచ్ చూశారు. ఈ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశనేని శివనాథ్‌కు పాపాహోమ్ విద్యార్థులు, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

స్థల స్వాధీనంలో అధికారుల నిర్లక్ష్యం

» మూడేళ్లుగా ఆక్రమణలోనే...
» ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు స్థానికుల ఫిర్యాదు

వెంకోజీపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే స్థలం జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణకు గురయ్యింది. జీవీఎంసీ లీగల్ కౌన్సిల్, అధికారులు చేయాల్సిన పనిని స్థానికులు కోర్టుకు వెళ్లి సాధించుకున్నా... కబ్జాదారుల నుంచి ఆ స్థలం స్వాధీనం కాలేదు. 16వ వార్డులోని 450 గజాల పార్కు స్థలం దుస్థితి ఇది. 1988-89లో సీతమ్మధార నుంచి వెంకోజీపాలెం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 127 మందికి భానునగర్‌లో స్థలాలిచ్చారు.ఈ లేఅవుట్‌లో 450 గజాలను పార్కు స్థలంగా కేటాయించారు. ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం కొంత ఆలస్యమైంది. ఈ క్రమంలో నారాయణశెట్టి సుమలత, నారాయణశెట్టి ఈశ్వరరావులు పార్కు స్థలాన్ని కబ్జా చేశారంటూ కాలనీ వాసులు హైకోర్టుకు వెళ్లి సాధించుకున్నారు. దాదాపు మూడేళ్ల క్రితమే జీవీఎంసీ అధికారులు ఈ స్థలంలో సగానికి ఫెన్సింగ్ వేసి, బోర్డు ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలంలో కబ్జాదారులు తమ పాకను అలానే ఉంచారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సిన జీవీఎంసీ లీగల్ కౌన్సిల్, అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు సోమవారం భానునగర్ వాసులు వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల వార్డులో జరిగిన రెవెన్యూ సదస్సులోనూ విన్నవించిన సంగతిని ఎమ్మెల్యేకు గుర్తు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పార్కు స్థలంలో అందరికీ ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. మంగళవారం జెడ్సీ, సర్వేయర్, పట్టణ ప్రణాళిక అధికారులను పంపించి స్థల పరిశీలన చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో భానునగర్ వాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా తదితరులు పాల్గొన్నారు.

'బాబు పాలనతోనే ప్రజలకు లబ్ధి'

మద్దిలపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ చెప్పారు. 22వ వార్డు మంగాపురం కాలనీలో సోమవారం ఆయన టీడీపీ సభ్యత్వం పొందిన వారికి గుర్తింపు కార్డులను అందించి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నారు. అందుకే ప్రజలు కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి,కోడిబోయిన ఆనంద్, డేవిడ్, దువ్వి రాజ్‌కుమార్, నాగూర్, గణేష్, ఈశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ సందడి



ఢిల్లీ క్యాపిటల్స్ జెండాలతో యువతుల ఉత్సాహం



ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తూ క్రికెట్ అభిమానుల ఆనందోత్సాహాలు

పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అభిమానులు సోమవారం అసలైన ఐపీఎల్ మజాను ఆస్వాదించారు. ఢిల్లీ క్యాపిటల్స్- లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన హోరా హోరీ పోరులో పరుగుల వరద పారింది. సిక్సర్లు, ఫోర్ల వర్షం కురవడంతో కేరింతలు కొట్టారు. అభిమానుల కేరింతలు, చప్పట్లతో స్టేడియం దద్దరిల్లింది. ఉత్కంఠగా సాగిన పోరులో విజయం ఇరుజట్ల మధ్య ఊగిసలాడడంతో ప్రేక్షకులు ఊపిరిబిగబట్టి వీక్షించారు. ఆఖరి ఓవర్‌లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొనడంతో మునివేళ్లపై నిల్చున్నారు. చివరికి ఢిల్లీ జట్టు బ్యాట్స్‌మన్ సిక్సర్ బాదడంతో సంబరాలు అంబరాన్నంటాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



స్టేడియం బయట క్రికెట్ అభిమానుల సందడి





బౌలింగ్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు విప్రాజ్ నిగమ్, కులదీప్ యాదవ్



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ క్రీడాకారుడు మార్క్రమ్ బ్యాటింగ్ విన్యాసం



హాఫ్ సెంచరీ చేసిన ఆనందంలో మార్ష్



మిరుమిట్లు గొలిపిన బాణసంచా వెలుగులు



మ్యాచ్ గెలిపించిన అశుతోష్ విజయ దరహాసం



మ్యాచ్‌ను వీక్షిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, తదితరులు



ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ బ్యాటింగ్



మ్యాచ్‌ను తిలకించిన గవర్నర్ దంపతులు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ లీగ్‌లో భాగంగా సోమవారం పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌ను తిలకించేందుకు విచ్చేసిన గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ దంపతులకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్ స్టేడియం ఆవరణలో స్వాగతించారు. పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేశారు. అనంతరం వీరంతా క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన గవర్నర్ దంపతులకు ఏసీఏ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు.



గవర్నర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్



మ్యాచ్ ప్రారంభానికి ముందు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చందనోత్సవం అధికారిగా భ్రమరాంబ

సింహాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 30న జరగనున్న వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ దర్భముళ్ల భ్రమరాంబ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ కె. చంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు, అందులో భాగస్వాములయ్యే అన్ని విభాగాధిపతులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆమె సీఎఫ్ఓ హోదాలో సింహాచలం దేవస్థానం ఈఓ నిర్వహించిన అన్ని సమన్వయ సమావేశాల్లోనూ పాల్గొనాల్సి ఉంది.



భ్రమరాంబ

క్రికెట్ మ్యాచ్‌కు 40 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలో సోమవారం జరిగిన ఐపీఎల్ టి-20 క్రికెట్ మ్యాచ్‌కు క్రీడాభిమానులను తరలించేందుకు ఆర్టీసీ 40 ప్రత్యేక సర్వీసులను నడిపింది. షెడ్యూల్ సర్వీసులతో పాటు 50 సర్వీసులు నడపాలని నిర్ణయించింది. గాజువాక, పాతపోస్టాఫీస్, సింహాచలం, కూర్మన్నపాలెం, తగరపువలస నుంచి 40 బస్సులు నడిపింది. గాజువాక, సింహాచలం, స్టీల్‌సిటీ, డిపోమేనేజర్లు, పర్యవేక్షించారని రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపండి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 309 వినతులు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్న సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు ఇచ్చే అర్జీలను 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పూర్వాపరాలు తెలుసుకుని సరైన సమాచారం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 309 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు 123, జీవీఎంసీ 88, పోలీసు 36 వచ్చాయి. అనంతరం వడగాడ్పుల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్ విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

ఆరోగ్యమిత్రలకు కనీస వేతనాలివ్వాలి

వైద్యమిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డు సిబ్బందికి కనీసవేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగమల్లేశ్వరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీడర్లు ఆందోళన చేపట్టారు. అర్హులైన మీటరు రీడర్లకు షిఫ్ట్ ఆపరేటర్లగా, వాచ్‌మన్‌లుగా, ఆఫీస్ సబార్డినేటర్లుగా, బ్రేక్‌డౌన్ గ్యాంగ్‌గా ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఆశావర్కర్లను రెగ్యులర్ చేయాలి

ఆశావర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని, ఆందోళన నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పనిచేసే అవకాశం ఇవ్వాలన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో 85 ఫిర్యాదులు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్‌కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులను సీపీ శంఖబ్రతబాగ్చి స్వీకరించారు. కుటుంబకలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, తదితర అంశాలున్నాయి.

పదో తరగతి గణితం పరీక్షకు 99.55 శాతం హాజరు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొత్తం 134 కేంద్రాల్లో 28,980మందికిగాను 28,851 మంది (99.55శాతం)మంది పరీక్ష రాయగా 129 మంది గైర్హాజరయ్యారన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్షలలో 849 మందికి గాను 757 మంది పరీక్ష రాయగా 92 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సర్క్యూట్ టూరిజం అభివృద్ధికి కృషి

పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్

సింహాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల పరిధిలో సర్క్యూట్ టూరిజం అభివృద్ధి కి కృషి చేయనున్నట్టు పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సింహగిరిపై ప్రసాద్ పథకం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సింహాచలం వచ్చే భక్తులకు పరిసర ప్రాంతాల్లోని సందర్శన ప్రాంతాలను చూపేవిధంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రసాద్ పథకం స్థలాల మార్పుల కారణంగా జాప్యం జరిగిందని, చందనోత్సవానికి క్యూకాంప్లెక్స్‌ను పూర్తిచేయాలని ఇంజనీర్లను ఆదేశించామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. రూ.99కోట్లతో గోదావరి పరీవాహక ప్రాంతాలను కలుపుతూ 'అఖండ గోదావరి', రూ.77కోట్లతో కడపలో గండికోట ప్రాజెక్టులను పర్యాటక రంగంలో సిద్ధం చేస్తున్నామన్నారు. మంత్రి వెంట పర్యాటకశాఖ ఆర్డీ జగదీష్, దేవస్థానం ఈఈ రమణ, ఏఈ మదన్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి ప్రసాద్ పథకం పనులను వివరిస్తున్న ఈఈ రమణ

అప్పన్నను దర్శించుకున్న మంత్రి

అంతకుముందు వరాహలక్ష్మీనృసింహస్వామిని మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కె. సుబ్బారావు ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం, బేడామండప ప్రదక్షిణలు తరువాత అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసి అర్చకులు శేషవస్త్రాన్ని పర్యవేటంగా చుట్టారు. గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

క్రైం... crime news

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పాటు మానసిక పరిస్థితి బాగోలేక ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి సమీప సత్తివానిపాలెంలో అల్లూరి సురేశ్ (40) భార్య అరుణకుమారి, కుమారుడితో నివాసం ఉంటున్నారు. సురేశ్ పరవాడ వద్దనున్న లారస్ ఫార్మా కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నారు. మూడు రోజులు క్రితం సురేశ్ కుటుంబంతో కలిసి విజయనగరం వెళ్లారు. డ్యూటీ నిమిత్తం సురేశ్ ఆదివారం ఇంటికి వచ్చేశారు. ఆదివారం రాత్రి సురేశ్‌కు భార్య ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. పనిలో ఉండి ఫోన్ ఎత్తలేదని భావించిన అరుణకుమారి సోమవారం ఉదయం మళ్లీ ఉదయం ఫోన్ చేసింది. అప్పుడు కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి విషయం తెలిపింది. దీంతో వారు సురేశ్ ఇంటికి వచ్చి తలుపు కొట్టినా తెరవకపోవడంతో కిటికీలోనుంచి లోపలకు చూశారు. ఆయన చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్టు గుర్తించి అరుణకుమారికి సమాచారం అందించారు. తమ భర్త మానసిక స్థితి బాగోలేక ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సురేశ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న మున్షిఫ్ లగూన్ (51) పెదగంట్యాడ మండలం మదీనాబాగ్ సమీపంలోని దేవాడ-రాజీవ్‌నగర్‌లో కుటుంబంతో ఉంటున్నారు. ఆదివారం రాత్రి లగూన్ సీ-షిఫ్ట్ డ్యూటీకి సైకిల్‌పై బయలుదేరి వెళ్లారు. తిరిగి ఆయన ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య జీవంతి కాంట్రాక్టరుకు ఫోన్ చేయగా లగూన్ డ్యూటీకి రాలేదని తెలిపారు. దీంతో భర్త ఎక్కడికో వెళ్లి ఉంటారని భావించింది. అయితే సోమవారం ఇస్లాంపేట సమీపంలోని డ్రైనేజీలో లగూన్ మృతి చెంది ఉన్నట్టు ఆమెకు స్థానికులు సమాచారాన్ని అందించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని లగూన్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఎంఆర్డీఏ ఆన్‌లైన్ లింక్ ప్రారంభం

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ నిర్వహిస్తున్న వివిధ కల్యాణ మండపాలకు ఆన్‌లైన్ బుకింగ్ అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చారు. పార్కులోని ఎంజీఎం, సబ్‌మెరైన్, సెంట్రల్ పార్కులో పార్టీ లాన్స్, గురజాడ కళాక్షేత్రం, బాలల ప్రాంగణం, అనకాపల్లి రావు గోపాలరావు కల్యాణమండపం, చినముషిడివాడ, తాటిచెట్లపాలెంలోని కల్యాణమండపాలు, కైలాసగిరి, విశ్వప్రియ ఫంక్షన్‌హాల్ వంటి వాటిలో వేడుకలు, శుభకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఆన్‌లైన్‌లో venuebooking.vmrdarental.com లింక్ ద్వారా మాత్రమే బుక్‌చేసుకునే సదుపాయం కల్పించింది. వీఎంఆర్డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సోమవారం ఈ లింక్‌ను ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు తగిన అవగాహన లేనివారికోసం వీఎంఆర్డీఏ కార్యాలయం కింది అంతస్థులో హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చామని, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీఎంఆర్డీఏ భవనాలు, లాన్‌లు కావాల్సిన వారు వినియోగించుకోవాలని కోరారు.



లింక్‌ను ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్